


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


ముంబైపై కోల్‌కతా ఉత్కంఠ విజయం..




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 136 | గురువారం 21 - 05 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


# 'మోదీ దేశద్రోహి'

## ప్రధానిపై రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు

- రాయ్‌బరేలీ సభలో ప్రసంగించిన రాహుల్
- మోదీ, అమిత్ షా దేశద్రోహులని వ్యాఖ్య
- రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని విమర్శ
- పెట్రో ధరలు పెరుగుతాయని అంచనా
- రాహుల్ వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ



# టీఎంసీ ఎంపీ తల నరికితే కోటి రూపాయలు..

- సాయోని ఘోష్ తల నరికితే రూ. కోటి ఇస్తానన్న బీజేపీ నేత
- ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ నేత ప్రదీప్ దీక్షిత్ వీడియో వైరల్
- శివలింగంపై పాత పోస్టు వివాదమే ఈ బెదిరింపులకు కారణం
- ఇదేనా నారీశక్తి వందన్ అంటూ ప్రధానిని ప్రశ్నించిన సాయోని ఘోష్
- ఆ వీడియో ఏఐ మానిప్యులేటెడ్ అంటూ ఖండించిన బీజేపీ నేత

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) లోక్‌సభ ఎంపీ సాయోని ఘోష్ తల నరికి తెచ్చినవారికి కోటి రూపాయల బహుమతి ఇస్తానంటూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం



# ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న మోదీ 'మెలోడీ' గిఫ్ట్!



- ఇటలీ పర్యటనలో మోదీ
- ఆ దేశ ప్రధాని మెలోనికి 'మెలోడీ' చాక్లెట్ల గిఫ్ట్
- వీడియోను సోషల్ మీడియాలో పెట్టిన మెలోని
- చాలా మంచి టోఫీలంటూ వ్యాఖ్య
- ఇద్దరి పేర్లను కలిపి 'మెలోడీ' అంటున్న నెటిజన్లు

భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిల మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్‌ను నెటిజన్లు సరదాగా 'మెలోడి' అని పిలుస్తుంటారు.

# గంగమాంబ జాతరలో పాల్గొన్న చంద్రబాబు

### అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన దంపతులు



## రోడ్డు పక్కన తాటిముంజలు తిన్న చంద్రబాబు దంపతులు



### కార్మికుడితో ముచ్చటించి యోగక్షేమాలు ఆరా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన సతీమణి భువనేశ్వరి పాతరోజులను గుర్తు తెచ్చుకున్నారు. బుధవారం సీఎం దంపతులు కుప్పంకు బయలుదేరారు.

## కేంద్రంలో బీజేపీ పతనం ఖాయం



- బెంగాల్‌లో మైనారిటీలు, వీధి వ్యాపారులే బీజేపీ లక్ష్యమంటూ ఆరోపణ
- తన ఇంటి కూల్చివేత నోటీసులపై స్పందించిన అభిషేక్ బెనర్జీ
- ఎలాంటి బెదిరింపులకు భయపడనని, బీజేపీపై పోరాటం ఆగదని స్పష్టీకరణ
- బీజేపీ 'బుల్డోజర్ సంస్కృతి'కి వ్యతిరేకంగా నిరసనలకు టీఎంసీ పిలుపు

# బండి భగీరథ్ పోక్సో కేసు..

## మరో సెక్షన్ ను జత చేసిన పోలీసులు



- కేసు నమోదైన వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసిన భగీరథ్
- ఫోన్ లోని డేటాను డిలీట్ చేసిన వైనం
- సాక్ష్యాలను ధ్వంసం చేసిన సెక్షన్ జత చేసిన పోలీసులు

# కువైట్‌లో చంద్రగిరి మహిళ ఇక్కట్లు



మహిళను వెనక్కి రప్పించాని సిఎం ఆదేశం

# ప్రభుత్వ పాఠశాలల పట్ల

## తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించండి:

- బాల్య వివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కర్నూలు, ఏఎస్ఆర్ జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెడతాం
- డీఈవోలు, ఏపీసీలతో సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్



ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా అధికారులు కృషిచేయాలి, ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సచివాలయంలో డీఈవోలు,

## గుడివాడలో వేంకటేశ్వరస్వామి బంగారు కిరీటం తాకట్టు



- 2025లో స్వామివారికి కిరీటాన్ని సమర్పించిన దాత మాటూరు సుబ్బారావు
- రూ. 38 లక్షలకు తాకట్టు పెట్టిన కమిటీ సభ్యులు
- జరిగిన నిర్వాకంపై మండిపడుతున్న భక్తులు

కృష్ణా జిల్లా గుడివాడలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సెంటిమెంట్‌తో ముడిపడిన ఒక షాకింగ్ మోసం వెలుగులోకి వచ్చింది. స్వామివారి బంగారు కిరీటాన్ని, ఆలయ కమిటీ సభ్యులు తమ సొంత అవసరాల కోసం గుట్టుచప్పుడు కాకుండా బ్యాంకులో తాకట్టు పెట్టి భారీగా డబ్బులు డ్రా చేసుకున్నారు.

# ఫర్టిలైజర్ డీలర్లు, గోడౌన్లపై తనిఖీలు చేపట్టండి:

- ఎరువులను పక్కదారి పట్టిస్తున్న వారిపై అచ్చెన్నాయుడు ఆగ్రహం
- అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం
- అధికారుల నిర్లక్ష్యంపై కూడా విచారణ జరపాలన్న మంత్రి



ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు అందాల్సిన ఎరువులను పక్కదారి పట్టిస్తూ, ఇతర వ్యవసాయేతర పనులకు తరలించడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కృత్రిమ ఎరువుల కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించే

# తెలుగు రాష్ట్రాలలో భానుడి భగభగలు...

## పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత



తెలుగు రాష్ట్రాల్లో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్లలో 47.6 డిగ్రీలు, తెలంగాణలోని నిర్మల్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. తెలంగాణలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా, ఏపీలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయినట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలోని హన్మకొండలో 46.4, జగిత్యాలలో 46.3, ఆదిలాబాద్‌లో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో కృష్ణా జిల్లాలోని

# నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ

మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని.. ఇందులో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని.. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని సీఎం అన్నారు.ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్ట్‌లకు 500 ఎకరాలు కేటాయించాలని సీఎం తెలిపారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చూడాలన్నారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్ రూపొందించాలని వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు.రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని.. డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలని సూచనలు చేశారు. జీసీసీలు, డేటా సెంటర్లు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలని ఆదేశించారు. ద్వితీయ శ్రేణి నగరాలల్లో జీసీసీ ఏర్పాటు పైనా దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు.. టీ్‌÷బైర్‌కు కనెక్ట్ కావాల్సిందే అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించండి: నారా లోకేశ్

ఏపీసీలతో మంత్రి సమీక్షించారు. కాకినాడ జిల్లాలో అప్పర్ ప్రైమరీ స్కూల్స్ లో స్టూడెంట్, టీచర్ యావరేజ్ అటెండెన్స్ తక్కువగా ఉంది. దీనిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. బేసిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, పదో తరగతి పరీక్షా ఫలితాలు, మధ్యాహ్న భోజనం వినియోగంలో జిల్లా వెనుకబడి ఉందన్నారు. అపార్ ఐడీ నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచారని మంత్రి ప్రశంసించారు. కాకినాడ డీఈవో పి.రమేష్ స్పందిస్తూ, జిల్లాలో 3,665 మంది డ్రాపౌట్స్ ఉన్నారని, ఎన్ రోల్ కానివారు 14,840 మంది ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు అసలు ఎన్‌రోల్ కానివారిపై దృష్టిసారించామని చెప్పారు. పలు మండలాల్లో సూడెంట్స్ అటెండెన్స్ తక్కువగా ఉండటంపై తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువస్తున్నట్లు వివరించారు. పదో తరగతి పరీక్షల్లో ఈ ఏడాది 80.47శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. 500కు పైగా మార్కులు సాధించిన వారు 2,789 మంది ఉన్నారని తెలిపారు.

**ప్రతి విద్యార్థిని ట్రాక్ చేయాలి** ప్రకాశం జిల్లాలో విద్యార్థుల డ్రాపౌట్స్ పై మంత్రి లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. వలస వెళ్లే వారిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పాఠశాలకు సెలవుల అనంతరం విద్యార్థులు ఏ ప్రాంతానికి వెళ్లినా వారి చదువు కొనసాగేలా ట్రాక్ చేయాలని ఆదేశించారు. సీజనల్ హాస్టల్స్ ను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో స్టూడెంట్, టీచర్ అటెండెన్స్ తక్కువగా ఉందని, లీప్ యాప్ లో టీచర్ అటెండెన్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని సూచించారు. స్టూడెంట్, టీచర్ రేషియోపైనా దృష్టిసారించాలన్నారు. ప్రకాశం జిల్లా డీఈవో సీవీ రేణుక స్పందిస్తూ.. ఈ ఏడాది జిల్లాలో పది శాతం ఎన్ రోల్ మెంట్ పెరిగిందని చెప్పారు. పాఠశాలలకు సెలవుల అనంతరం వ్యవసాయ పనుల్లో పడి విద్యార్థుల హాజరు నమోదు తక్కువగా ఉంటోందని వివరించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారని, పదో తరగతి టాపర్లను సన్మానించారని తెలిపారు. వచ్చే ఏడాది మరింత ఉత్తమ ఫలితాలు సాధిస్తామని చెప్పారు.

**బాల్యవివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి** చిత్తూరు జిల్లాలో బాల్య వివాహాల పట్ల మంత్రి నారా లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో జీఎఫ్ఎల్ఎన్ పై దృష్టి సారించాలని ఆదేశించారు. స్టూడెంట్స్ ఫెర్ఫార్మెన్స్ కూడా తక్కువగా ఉందని, ఓవరాల్ ఫెర్ఫార్మెన్స్ లో కూడా చిత్తూరు వెనుకబడి ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. చిత్తూరు డీఈవో కే.రాజేంద్రప్రసాద్ స్పందిస్తూ.. చిత్తూరుకు తమిళనాడు, బెంగళూరు దగ్గరగా ఉండటంతో డ్రాప్ అవుట్స్ ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. పలుచోట్ల బాల్యవివాహాలు కూడా జరుగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. లీప్ యాప్ డౌన్ లోడ్స్ పై దృష్టికేంద్రీకరిస్తామని చెప్పారు.

**ఏఎస్ఆర్ జిల్లాకు అన్ని విధాల అండగా ఉంటాం** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, ఆ జిల్లాకు అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి లోకేశ్ చెప్పారు. హైస్కూల్స్ లో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉండటంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై దృష్టిసారించాలని ఆదేశించారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో విద్యార్థుల చేరిక తక్కువగా ఉందని, దీనిపైనా దృష్టిపెట్టాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాలపై స్పందిస్తూ, అక్కడి విద్యార్థుల్లో కసి ఉందని, వారికి దిశానిర్దేశం చేస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. డీఈవో కే.రామకృష్ణారావు స్పందిస్తూ.. జిల్లాలో 3,242 మంది డ్రాపౌట్స్ ఉన్నారు. స్టూడెంట్స్ యావరేజ్ అటెండెన్స్ 79.30 శాతం ఉందని, టీచర్ల సరాసరి హాజరు 78.40 శాతంగా ఉందని వివరించారు.

**స్లిప్ టెస్ట్ అటెండెన్స్ పై దృష్టిపెట్టాలి** ఏలూరు జిల్లాలో స్లిప్ టెస్ట్ అటెండెన్స్ తక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారించాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. టీచర్ అటెండెన్స్ పైనా దృష్టిసారించాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఎందుకు వెనుకబడి ఉన్నారని మంత్రి ఆరా తీశారు. కొన్ని మండలాల్లో ఉత్తీర్ణతా శాతంపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ స్పందిస్తూ.. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. టీ టైమ్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల పనితీరు గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నట్లు చెప్పారు.

## ఫర్టిలైజర్ డీలర్లు, గోడౌన్లపై తనిఖీలు చేపట్టండి: అచ్చెన్నాయుడు

అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అక్రమ నిల్వలపై నిఘా పెట్టేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫెర్టిలైజర్ డీలర్లు, గోదాములపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. ఎరువుల పంపిణీలో వ్యవసాయ శాఖ అధికారుల వైపు నుంచి ఏమైనా నిర్లక్ష్యం ఉందా అనే కోణంలోనూ తక్షణమే విచారణ జరపాలని ఆయన సూచించారు. రైతులకు సాగు సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఇకపై ప్రతిరోజూ జిల్లాల వారీగా ఎరువుల నిల్వలపై (స్టాక్) ప్రత్యేకంగా మానిటరింగ్ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. అన్నదాతలను మోసం చేసే ఏ ఒక్క చర్యను ప్రభుత్వం ఉపేక్షించబోదని హెచ్చరించారు. ఏ డీలరైనా ఎరువులను బ్లాక్‌కు తరలించినా లేదా పక్కదారి పట్టించినా వారి లైసెన్సులను తక్షణమే రద్దు చేయడంతో పాటు, వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆజ్ఞాపించారు.

## తెలుగు రాష్ట్రాలలో భానుడి భగభగలు...

కంకిపాడు, మార్కాపురంలోని నందనమారెళ్ల, 46.1 డిగ్రీలు, తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

## కువైట్‌లో చంద్రగిరి మహిళ ఇక్కట్లు

కువైట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ మహిళకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. బాధితురాలిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. చంద్రగిరి మండలం తొండవాడ గ్రామానికి చెందిన భాగ్యవతి ఉపాధి కోసం ఫిబ్రవరిలో కువైట్‌కు వెళ్లగా, అక్కడ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఓ వీడియో విడుదల చేసింది. గృహ సహాయకురాలిగా పనిచేస్తున్న తనకు సంబంధిత ఏజెంట్లు సరైన ఉద్యోగ వీసా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తాను శారీరక, మానసిక వేధింపులకు గురవుతున్నట్లు వీడియో ద్వారా తెలిపింది. స్వదేశానికి పంపాలంటే డబ్బులు చెల్లించాలని ఏజెంట్లు ఒత్తిడి చేస్తున్నారని పేర్కొంది. ఈ ఘటనపై వచ్చిన మీడియా కథనాలకు ముఖ్యమంత్రి కార్యాలయం వెంటనే స్పందించింది. బాధితురాలిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సీఎం సూచనలతో వెంటనే స్పందించిన ఏపీ ఎన్ఆర్టీ అధికారులు కువైట్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు ప్రారంభించారు.

# ట్రంప్ అధికారాలకు కత్తెర

ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..తనకేమీ పట్టనట్టు ట్రంప్ మహాశయుడు ఫిడేల్ వాయిస్తున్నాడు. యుద్ధం ..యుద్ధం అంటూ కలవరిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు తప్పవని హెచ్చరిస్తున్నాడు. అయితే పశ్చిమాసియా యుద్ధానికి సంబంధించి తాజాగా తీవ్ర ఉత్కంఠ పరిణామాలు చకచకా చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం తెరవెనక సాగుతున్న చర్చల్లో ఒప్పందం కుదరకుంటే... 2-3 రోజుల్లోనే.. లేదంటే వచ్చే వారం ఆరంభంలో తాము ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీంతో మరోమారు ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇప్పటికే అమెరికా సహా అన్ని దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నా ట్రంప్ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ కళ్ళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. దీంతో అయినా ట్రంప్ దూకుడు ఆగతుందా అన్నది చూడాలి. ఇకపోతే ఇరాన్‌తో భారీస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అవి సఫలమై.. మా దాడి ప్రణాళిక శాశ్వతంగా అటకెక్కుతుందని ఆశిస్తున్నా అంటూ ట్రంప్ తాజాగా వెల్లడించాక ఈ తీర్మనం వచ్చింది. టెహ్రాన్ చేతికి అణ్వాయుధాలు దక్కకుండా ఉండే ఒప్పందం మాకు ఆమోదయోగ్యమవుతుందని శ్వేతసౌధంలో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై భారీ స్థాయిలో వెంటనే దాడులు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని తమ అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మంగళవారమే భారీ స్థాయిలో దాడులు జరపాలనుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే అరబ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు చివరి నిమిషాల్లో ఆ ప్రణాళికను తాత్కాలికంగా పక్కనపెట్టానన్నారు. టెహ్రాన్‌తో చర్చలు సీరియస్‌గా సాగుతున్నాయని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరే అవకాశాలు ఉండటం వల్లే దాడుల నిర్ణయాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యవహాఇర శైలి చూస్తుంటే ఆయన దేనికైనా తెగిస్తాడని అనుకోవాలి. ఇకపోతే ఇరాన్ కూడా గట్టిగానే సమాధ్రానం ఇస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేస్తే.. తాము యుద్ధరంగంలో కొత్త సాధనాలతో, సరికొత్త విధానాల్లో విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరించింది. తమను దిగ్బంధించడం, ఓడించడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొంది. టెహ్రాన్‌లోని వాలియాస్ స్క్వేర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆ దేశ సైన్యాధికారి బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ అక్రమినియా ఈ వ్యాఖ్యలు చేశారు. తమ సాయుధ దళాలు గతంలో కంటే ఇప్పుడు మరింత బలంగా, సన్నద్ధంగా ఉన్నాయని ఇరాన్ పేర్కొంది. సైన్యం ట్రిగ్గర్‌పై వేలు పెట్టి సిద్ధంగా ఉందని హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను హతమారిస్తే.. 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.560 కోట్లు) బహుమతిగా ఇస్తామని ఇరాన్ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు 'ఇస్లామిక్ రిపబ్లిక్ భద్రతా దళాల ప్రతిచర్య' పేరిట బిల్లును సిద్ధం చేస్తున్నట్లు ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఛైర్మన్ ఇబ్రహీమ్ అజీజ్ తెలిపారు. దీనిపై త్వరలోనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. తమ దేశంలోని బరకాహ్ అణు విద్యుత్కేంద్రంపై ఇటీవల దాడి చేసిన డ్రోన్లు ఇరాక్ భూభాగం నుంచి దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ శాఖ మంగళవారం వెల్లడించింది. ఇరాన్ మద్దతున్న షియా మిలీషియాలు వాటిని ప్రయోగించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఇటీవల చేసిన దాడులు పర్యావరణానికి హానికరంగా మారి, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ఆయిల్ రి్‌÷నైరీపై జరిగిన ఓ దాడితో సముద్ర జలాల్లోకి చమురు చేరి.. అలల ద్వారా పర్షియన్ గల్ఫ్‌లోని శిద్వార్ దీవిపైకి కొట్టుకొచ్చింది. అది జనావాసాల్లేని దీవి. వణ్యప్రాణులు చాలానే ఉన్నాయి. చమురు వ్యాప్తితో వాటి మనుగడకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. అమెరికా దూకుడు తగ్గకుంటే ప్రపంచంలో ఆర్థిక, ఆహార సంక్షోభం తీవ్రం కానుంది. ఇప్పటికే గల్ఫ్ దేశాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. ఇది మరింత తీవ్రం అయ్యే ప్రమాదం ఉంటి. ఖతార్ లాంటి దేశాల్లో ఆహార కొరత తీవ్రంగా ఉంది. వారి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో శాంతి చర్చలకు ప్రపంచ దేశాలు ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉంది.

## ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం యుద్ధ అధికారాలను పరిమితం చేస్తూ తీర్మానం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ క్లళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ఇరాన్ పై యుద్ధానికి దిగారు. యుద్ధంపై ట్రంప్ అధికారాలను పరిమితం చేసేందుకు డెమోక్రట్లు అనేకసార్లు సెనెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. అయితే, వారి తీర్మానాలకు తగినంత ఓటింగ్ లభించలేదు. డెమోక్రటిక్ సెనెటర్ టిమ్ కెయిన్ తాజాగా మరోసారి సెనెట్ ముందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. యుద్ధ ప్రకటన, సైనిక చర్యకు కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లభిస్తే తప్ప.. ఇరాన్ లోపల లేదా దానికి వ్యతిరేకంగా జరిగే ఘర్షణల్లో యూఎస్ దళాలు పాల్గొనకూడదని అందులో తెలిపారు. దీనికి 50 మంది అనుకూలంగా.. 47 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఈ తీర్మానం ఆమోదంలో నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. కాగా.. ఈ బిల్లు ఆమోదానికి సంబంధించి త్వరలో తుది ఓటింగ్ జరగనుంది. ఇది చట్టంగా మారితే.. కాంగ్రెస్ అధికారికంగా సైనిక దాడి కొనసాగించడానికి అనుమతి ఇచ్చేవరకు ట్రంప్ ఇరాన్‌పై ఎలాంటి దాడులకు దిగకూడదు. ఓటింగ్ సందర్భంగా డెమోక్రటిక్ సెనెట్ చక్ షుమర్ మాట్లాడుతూ.. యుద్ధానికి సంబంధించిన నిర్ణయాలపై కాంగ్రెస్ తిరిగి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. 'ఈ అధ్యక్షుడు నిండుగా తూటాలున్న తుపాకీతో ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా ఉన్నాడు' అని వ్యాఖ్యానించారు. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# రోడ్డు పక్కన తాటిముంజలు తిన్న చంద్రబాబు దంపతులు

ఈ క్రమంలో రహదారి పక్కన తాటి ముంజలు అమ్ముతున్న ద కార్మికుడి వద్ద సీఎం దంపతుల వాహనం ఆగింది. వారు స్వయంగా వాహనం దిగి, ఆ కార్మికుడి వద్ద తాటి ముంజలను కొనుగోలు చేయడమే కాకుండా, ఆయనతో ఎంతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ విషయాన్ని సీఎం తన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'కల్తీ లేదు... కార్బైడ్ లేదు.. పురుగు మందుల గోల లేదు.. మా కుప్పం ప్రజల మనసుల్లాంటి స్వచ్ఛమైన, చల్లనైన తాటి ముంజలు రోడ్డు పక్కన ఆగి తింటుంటే ఎంతో హాయిగా ఉంది' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. చిన్ననాటి రోజులు జ్ఞాపకానికి వచ్చాయన్నారు. తాటి ముంజలు అమ్మే వ్యక్తి కుటుంబ పరిస్థితులు, వ్యాపారం, యోగక్షేమాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి తన వద్దకు వచ్చి సాదాసీదాగా మాట్లాడటంతో ఆ కార్మికుడు ఆనందంలో మునిగిపోయాడు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రజల కష్టం, వారి జీవన విధానం, సహజసిద్ధమైన ఆహారాల ప్రాధాన్యం గురించి చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం దంపతులు చూపిన ఈ నిరాడంబరత, అప్యాయతలను అక్కడున్న స్థానికులు ఎంతో ప్రశంసించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# గంగమాంబ జాతరలో పాల్గొన్న చంద్రబాబు

చిత్తూరు జిల్లా కుప్పం శ్రీప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా ఉండవల్లి నుంచి హెలికాప్టర్ ద్వారా తుమ్మిసి హెలిప్యాడ్‌కు వచ్చిన సీఎం.. స్వగృహానికి చేరుకున్నారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో శ్రీప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయానికి చేరుకున్న సీఎంకు.. అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. జాతర సందర్భంగా అమ్మవారికి కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలను సమర్పించి.. ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

# 'మోదీ దేశద్రోహి'..

ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మోదీ 'దేశద్రోహి' అని విమర్శించారు. దేశాన్ని అమ్మేశారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీలో ఓ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన బుధవారం ఈ వ్యాఖ్యలు చేశారు."ఎండను సైతం లెక్కచేయకుండా వచ్చిన మీకు ధన్యవాదాలు. ఇంటికి వెళ్లాక మీ దగ్గరకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వచ్చి మోదీ, అమిత్ షా గురించి మాట్లాడితే దీటుగా సమాధానం ఇవ్వండి. మీ ప్రధాని, హోంమంత్రి, మీ సంస్థ దేశద్రోహులని వారికి చెప్పండి. వాళ్లు దేశాన్ని అమ్మేయడానికి పనిచేస్తున్నారని తెలియజేయండి. మన వ్యవస్థలపై దాడి చేస్తున్నారని, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, అంబేద్కర్, వీర్ పాసి, మహాత్మా గాంధీని విమర్శిస్తున్నారని చెప్పండి" అంటూ రాహుల్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.త్వరలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరుగుతాయని రాహుల్ అంచనా వేశారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సామాన్యులు అల్లాడిపోతున్నారని చెప్పారు. మోదీ ప్రభుత్వ వైఫల్యం వల్ల త్వరలో ఆర్థిక తుపాను రాబోతోందని పునరుద్ఘాటించారు. దీనికి మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్సే కారణమన్నారు. రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఆయన వ్యాఖ్యలు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయని ఆక్షేపించింది. దేశ ప్రజలను రాహుల్ అవమానిస్తున్నారంటూ మండిపడింది.

# ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న మోదీ 'మెలోడీ' గిఫ్ట్!

దీనిపై సోషల్ మీడియాలో ఎన్నో మీమ్స్ కూడా వచ్చాయి. అయితే ఈ క్రేజ్‌ను మోదీ భలే వాడుకున్నారు. తన ఇటలీ పర్యటనలో భాగంగా మెలోనికి సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చి అందరినీ నవ్వించారు.

**స్వీట్ గిఫ్ట్** ఐదు దేశాల పర్యటనలో భాగంగా రోమ్ చేరుకున్నారు మోదీ. ఈ సందర్భంగా మెలోనిని కలిసిన ఆయన.. భారత్‌లో ఎంతో పాప్యులర్ అయిన 'పార్లే మెలొడీ' చాక్లెట్ ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చారు. ఇద్దరు నేతల పేర్లను కలిపి ఇంటర్నెట్‌లో నడుస్తున్న ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని మోదీ ఈ సరదా గిఫ్ట్ ప్లాన్ చేశారు.

**వీడియో వైరల్** ఈ చాక్లెట్ ప్యాకెట్‌ను అందుకున్న మెలోని.. ప్రధాని మోదీతో కలిసి దిగిన ఒక చిన్న వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. 'బహుమతికి చాలా థాంక్స్' అని ఆమె రాశారు. వీడియోలో మెలోని మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీ నాకోసం చాలా మంచి టోఫీలు తెచ్చారు' అనగానే, పక్కనే ఉన్న మోదీ నవ్వుతూ 'మెలొడీ' అని అన్నారు. ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. గంట వ్యవధిలో లక్షకు పైగా లైక్స్, దాదాపు 9,000 కామెంట్స్, 25 వేలకు పైగా షేర్స్ వచ్చాయి.

**కార్ డిప్లొమసీ** రోమ్ చేరుకున్న మోదీకి మెలోనీ ఘన స్వాగతం పలికారు. ఇద్దరూ కలిసి కార్‌లో ప్రయాణిస్తూ నగర వీధుల్లో సందడి చేశారు. తర్వాత రాత్రి పూట రోమ్‌లోని ప్రసిద్ధ చరిత్రాత్మక కట్టడం కొలోసియంను సందర్శించారు. అక్కడ కాసేపు నడుస్తూ ఇరు దేశాల మధ్య మైత్రిని మరింత బలోపేతం చేయడంపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు.

**బహుమతిగా కాశీ చిత్రం** ఈ పర్యటనలో మోదీని ఇటలీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు జాంపాలో టొమాసెట్టి కలిశారు. ఆయన స్వయంగా గీసిన వారణాసి (కాశీ) పెయింటింగ్‌ను మోదీకి బహుమతిగా ఇచ్చారు. టొమాసెట్టికి భారతీయ సంస్కృతిపై ఉన్న ఇష్టాన్ని మోదీ 'ఎక్స్' వేదికగా అభినందించారు. రోమ్ నగరంలో కాశీ దృశ్యాలను చూడటం ఆనందంగా ఉందంటూ రాసుకొచ్చారు.

# టీఎంసీ ఎంపీ తల నరికితే కోటి రూపాయలు..

రేపుతున్నాయి. యూపీలోని బులంద్‌షహర్ జిల్లా సికంద్రాబాద్ బీజేపీ మున్సిపల్ ఛైర్మన్ ప్రదీప్ దీక్షిత్ ఈ ప్రకటన చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ బెదిరింపు వీడియోపై ఎంపీ సాయోని ఘోష్ 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. "నా తల నరికితే రూ. కోటి రివార్డు ఇస్తామని బహిరంగంగా ప్రకటించడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన పోస్టులో ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ట్యాగ్ చేస్తూ.. "కొత్త భారత్‌లో ఇదేనా నారీశక్తి వందన్?" అని మహిళా రిజర్వేషన్ బిల్లును ఉద్దేశించి ప్రభుత్వాన్ని నిలదీశారు. సాయోని ఘోష్ 2015లో శివలింగంపై చేసిన ఒక పాత సోషల్ మీడియా పోస్టుకు సంబంధించి ఈ వివాదం మళ్లీ రాజుకుంది. ఈ పోస్టు హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. అయితే, తన ఖాతా హ్యాక్ అయిందని, విషయం తెలిసిన వెంటనే ఆ పోస్టును తొలగించానని సాయోని గతంలోనే వివరణ ఇచ్చారు. ఈ పాత వివాదంపై ఆదివారం సికంద్రాబాద్‌లో నిరసన చేపట్టారు. ఈ క్రమంలోనే ప్రదీప్ దీక్షిత్ ఈ బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి.పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో మహిళల భద్రతను బీజేపీ పెద్ద అంశంగా చేసిందని, కానీ ఇప్పుడు అదే పార్టీ నేత ఒక మహిళా ఎంపీని బహిరంగంగా బెదిరిస్తున్నారని సాయోని మండిపడ్డారు. ఈ ఘటనపై యూపీ, కోల్‌కతా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అయితే, బీజేపీ నేత ప్రదీప్ దీక్షిత్ ఈ ఆరోపణలను ఖండించారు. వైరల్ అవుతున్న వీడియో ఏఐ టెక్నాలజీతో మార్ఫింగ్ చేసిందని, తాను అలాంటి వ్యాఖ్యలు చేయలేదని పేర్కొన్నారు.

# కేంద్రంలో బీజేపీ పతనం ఖాయం

బీజేపీపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ త్వరలోనే కేంద్రంలో అధికారం కోల్పోవడం ఖాయమని ఆమె జోస్యం చెప్పారు. మంగళవారం తన నివాసంలో టీఎంసీ ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఏర్పడిన సువేందు అధికారి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీలు, వీధి వ్యాపారులను లక్ష్యంగా చేసుకుంటోందని మమత ఆరోపించారు. "మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. వీధి వ్యాపారుల దుకాణాలను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం మన రాజ్యాంగ విలువలను కాలరాస్తోంది" అని ఆమె విమర్శించారు.ఇదే సమావేశంలో పాల్గొన్న టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీ కూడా బీజేపీకి సవాల్ విసిరారు. తన ఇంటిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలంటూ కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ (ఖవీజ) ఇచ్చిన నోటీసులపై ఆయన ఘాటుగా స్పందించారు. "వారు నా ఇల్లు కూల్చినా సరే.. ఇలాంటి బెదిరింపులకు నేను తలొగ్గేది లేదు. ఏదేమైనా బీజేపీపై నా పోరాటం కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ నోటీసులు జారీ చేసిన కేఎంసీ ఇప్పటికీ టీఎంసీ నియంత్రణలోనే ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా సీఎం సువేందు అధికారిపై అభిషేక్ పరోక్షంగా విమర్శలు చేశారు. "కెమెరా ముందు డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన వ్యక్తి ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యారు" అని 2014 నాటి నారద స్టింగ్ ఆపరేషన్‌ను ప్రస్తావిస్తూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం సృష్టిస్తున్న 'బుల్డోజర్ సంస్కృతి'కి వ్యతిరేకంగా మే 21 నుంచి కోల్‌కతాలో భారీ నిరసనలు చేపట్టాలని టీఎంసీ నిర్ణయించింది.

# గుడివాడలో వేంకటేశ్వరస్వామి బంగారు కిరీటం తాకట్టు

మాటూరు సుబ్బారావు అనే దాత 2025లో సుమారు రూ. 70 లక్షల విలువైన బంగారు కిరీటాన్ని స్వామివారికి విరాళంగా సమర్పించారు. అయితే, ఇటీవల కాలంలో స్వామివారికి ఆ కిరీటాన్ని అలంకరించకపోవడంతో అనుమానం వచ్చిన దాతలు ఆలయ కమిటీని నిలదీశారు. దీంతో అసలు విషయం బయటపెట్టిన కమిటీ సభ్యులు.. ఆ కిరీటాన్ని రూ. 38 లక్షలకు తాకట్టు పెట్టినట్లు అంగీకరించారు. ఈ వ్యవహారంపై దాత సుబ్బారావు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరి సమక్షంలో స్వామివారికి బహూకరించిన కానుకలతో ఇలా వ్యాపారం చేయడంపై భక్తులు మండిపడుతున్నారు. ఈ వంచనపై తాము పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, సివిల్ వ్యవహారంగా పేర్కొంటూ కోర్టుకు వెళ్లమని పోలీసులు సూచించారని దాత ఆరోపించారు. ఆలయ పవిత్రతను దెబ్బతీసిన ఈ కమిటీ నుండి ఆ బంగారు కిరీటాన్ని వెంటనే రికవరీ చేసి తమకు అప్పగించాలని, దాన్ని భక్తుల నమ్మకాన్ని కాపాడే మరో మంచి ఆలయానికి సమర్పిస్తామని దాతలు స్పష్టం చేస్తున్నారు. భగవంతుడి సొత్తును సైతం పక్కదారి పట్టించిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది.

# నంద్యాల మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ మాయాజాలం..










**నంద్యాల సిటీ బ్యూరో మే 20 ( నంది పత్రిక )** ఉద్దేశపూర్వకంగానే గోప్యంగానే వార్డుల విభజన జాబితాను ఉంచిన కమిషనర్ పై చర్యలు తీసుకోవాలి... అన్ని రాజకీయ పార్టీల నేతలు నంద్యాల మున్సిపాలిటీలో వార్డుల విభజన వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది! మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఇష్టారాజ్యంగా, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ అన్ని రాజకీయ పార్టీల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం బహిర్గతం చేయాల్సిన వార్డుల విభజన జాబితాను.. కమిషనర్ ఉద్దేశపూర్వకంగానే గోప్యంగా ఉంచారని రాజకీయ నేతలు ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌తో పాటు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ తక్షణమే స్పందించి, సదరు కమిషనర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నంద్యాల మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాయాజాలం స్క్రీన్ ప్లేను తలపిస్తోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజన ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న 42 వార్డులను 52 వార్డులుగా పెంచుతూ విభజన పూర్తి చేశారు. అయితే, రూల్స్ ప్రకారం విభజన జరిగిన 52 వార్డుల పూర్తి వివరాలను, మ్యాపులను ప్రజల పరిశీలన కోసం ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ఉంచాలి. కానీ కమిషనర్ శేషన్న మాత్రం ఈ వివరాలను అత్యంత గోప్యంగా ఉంచడం ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ నెల 18వ తేదీనే వార్డుల వివరాలను బహిర్గతం చేయాలని రాజకీయ నేతలు కమిషనర్‌ను కోరారు. అయితే బాధ్యతగల స్థానంలో ఉన్న మున్సిపల్ కమిషనర్.. అత్యంత నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా సమాధానం చెప్పడం గమనార్హం. “ఇలాంటివి కామన్‌గా జరుగుతుంటాయి“ అంటూ లైట్ తీసుకోవడంపై స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వార్డుల విభజనలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, అందుకే వివరాలు దాస్తున్నారని వైసిపి నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు, రాజకీయ పార్టీలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారే.. ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై రాజకీయ శ్రేణులు మండిపడుతున్నాయి.

నిబంధనలను తుంగలో తొక్కిన మున్సిపల్ కమీషనర్ బండి శేషన్నపై.. జిల్లా కలెక్టర్, అలాగే మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ రాజకుమారి గనియా తక్షణమే స్పందించి కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాజకీయ నేతలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# డ్రాపు తొలగింపు పై రైతుల అభ్యంతరం



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 20** : తెలుగు గంగ ప్రధాన కాలువలో డ్రాపును తొలగించడం పట్ల రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు గంగ కాలువకు సంబంధించి నాలుగు ఐదు బ్లాకుల మధ్యన 5 అడుగుల ఎత్తులో చాలా సంవత్సరాల క్రితం డ్రాప్ ను ఏర్పాటు చేయడం జరిగింది. దీనివల్ల ఆ ప్రాంతంలో ఉన్న బ్రాహ్మణ చెరువుకు నీళ్లు పుష్కలంగా పారుతూ ఉంటాయి. బ్రాహ్మణ చెరువు కింద దాదాపు 200 ఎకరాల ఆయకట్టు భూములకు నీళ్లు పారుతూ ఉంటాయి. కాలువలో 500 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్నప్పుడు కూడా చెరువుకు నీళ్లు పారుతాయని రైతులు పేర్కొంటున్నారు. తెలుగు గంగ అధికారులు ఉన్నఫలంగా కాలువలో ఉన్న డ్రాపును తొలగించడంలో అర్థం లేదని రైతులు వాపోతున్నారు. రైతులతో ఏమాత్రం సంప్రదించకుండా అధికారులు డ్రాప్ ను ఎందుకు తొలగించారని బ్రాహ్మణ చెరువు నీటి సంఘం అధ్యక్షుడు పాల శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. డ్రాప్ ను తొలగించడం వల్ల భవిష్యత్తులో బ్రాహ్మణ చెరువుకు తెలుగు గంగ కాలువద్వారా నీటిని నింపుకునే అవకాశాన్ని రైతులు కోల్పోతారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రాపును పునరుద్ధరించాలని పాలశంకర్ తెలుగు గంగా అధికారులకు విజ్ఞప్తి చేశారు.

**రైతు ప్రయోజనాల కోసమే**
**ఎస్ ఈ శంకర్ రెడ్డి**

రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కాలువలో ఉన్న డ్రాపులను తొలగించడం జరుగుతుందని తెలుగు గంగ సూపరిన్ టెండెంట్ ఇంజనీర్ శంకర్ రెడ్డి పేర్కొన్నారు. వర్షాకాలంలో నీటి ప్రభావం అధికమైనపుడు, కాలువలో డ్రాపులు ఉండటం వల్ల , తెలుగు గంగ ప్రధాన కాలువలకు గండ్లు పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రాపులను తొలగించడం జరుగుతూ ఉందని అన్నారు.



నీటిపారుదల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ప్రాంతాలలో ఉన్న డిస్ట్రిబ్యూటరీల వద్ద ప్రత్యేకంగా బెడ్లను ఏర్పాటు చేస్తామని, దీనివల్ల రైతులకు ప్రయోజనాలు చేకూర్తాయని ఎస్ ఈ శంకర్ రెడ్డి వివరించారు.

# మే 31న నంద్యాలలో 'సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన' 10వ వార్షికోత్సవ మహాసభ



**సీమ హక్కుల సాధనకై ప్రజలు, మేధావులు కదిలిరావాలని పిలుపు రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో కరపత్రాల విడుదల.**

**నంద్యాల సిటీ బ్యూరో మే 20 ( నంది పత్రిక )** రాయలసీమ సాగునీటి హక్కుల సాధనే ధ్యేయంగా, ప్రజా చైతన్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ నెల మే 31న నంద్యాలలో సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 10వ వార్షికోత్సవ మహాసభను నిర్వహించనున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రకటించింది. బుధవారం నంద్యాలలోని సమితి కార్యాలయంలో ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో సమితి కార్యవర్గ సభ్యులు ఈ మహాసభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ.. 2016 మే 31న సుమారు 30,000 మంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని నిర్వహించిన 'సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన' ఉద్యమం ఒక చరిత్ర సృష్టించిందని గుర్తుచేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి దశాబ్దం (10 ఏళ్లు) పూర్తయినప్పటికీ, రాయలసీమకు జరగాల్సిన న్యాయం ఇంకా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభ కేవలం ఒక వేడుక కాదు, సీమ ఆత్మగౌరవ గర్జన అని, హక్కుల సాధనకై సాగే మరో సంకల్ప ఘడియ అని స్పష్టం చేశారు. బచావత్ ట్రిబ్యునల్ మరియు ఏపీ పునర్విభజన చట్టం–2014 ప్రకారం రాయలసీమలోని 90 లక్షల ఎకరాల వ్యవసాయ యోగ్యమైన భూమిలో.. 22 లక్షల ఎకరాలకు సాగునీటి హక్కులు ఉన్నాయి. కానీ, పాలకుల నిర్లక్ష్యం, అసంపూర్ణ ప్రాజెక్టుల వల్ల నేడు కేవలం 8 లక్షల ఎకరాలకు మాత్రమే నీరు అందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలకు మద్దతు ధరలు లేకపోవడంతో సీమ వ్యవసాయం తిరోగమన దిశలో పడిపోయిందనీ.. పాలనా, అభివృద్ధి వికేంద్రీకరణను నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ ప్రాంతం మరింత వెనుకకు నెట్టబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం గడిచినా రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజీ, హైకోర్టు ఏర్పాటు, కడప ఉక్కు కర్మాగారం, అనంతపురం ~~××మీా, సీడ్ & హార్టికల్చర్ హబ్‌లు, జాతీయ స్థాయి విద్యా–వైద్య సంస్థలు, పరిశ్రమలు మరియు ఉపాధి అవకాశాలు ఇప్పటికీ కేవలం హామీలుగానే మిగిలిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో, రాయలసీమ ప్రజల ఆశలు, ఆకాంక్షలను గట్టిగా వినిపించడానికి, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందించడానికి ఈ మహాసభ వేదిక కానుందని సమితి నాయకులు తెలిపారు. మే 31న చాబోలు మెట్ట దగ్గర ~~= కళ్యాణ మండపం నందు జరిగే ఈ మహాసభకు రాయలసీమ వ్యాప్తంగా ఉన్న రైతులు, యువత, మేధావులు, ప్రజా సంఘాలు స్వచ్ఛందంగా తరలివచ్చి జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సమితి కార్యవర్గ సభ్యులు ఏరువ రామచంద్రారెడ్డి, పట్నం రాముడు, మహేశ్వరరెడ్డి, కొమ్మా శ్రీహరి, భాస్కర్ రెడ్డి, రాఘవేంద్ర గౌడ్, మనోజ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# అన్నీ ఉచితాలే !



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 20:** మీ పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఎలాంటి అడ్మిషన్ ఫీజులు ఉండవు. పిల్లలను ఉచితంగానే చేర్చుకుంటాం. యూనిఫామ్ కు ప్రైవేట్ పాఠశాలల మాదిరిగా ఎలాంటి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు. యూనిఫాం కూడా ఉచితంగానే ఇస్తాం! పుస్తకాలకు ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. పుస్తకాలు కూడా ఉచితంగానే ఇస్తాం! పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్న భోజనం పథకం కింద రుచికరమైన పోషకాలతో కూడిన భోజనాన్ని అందిస్తాం. ఇందుకు కూడా ఎలాంటి డబ్బు మాకు చెల్లించాల్సిన అవసరం లేదు. దయచేసి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి! అంటూ అధికారులు గ్రామాలలో పర్యటించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపడుతూ ఉన్నారు. బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం రామాపురం, పార్నపల్లి, లింగాపురం, పెద్దదేవలాపురం, కడమల కాల్వ గ్రామాలలో అధికారులు తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. రామాపురం గ్రామంలో తాసిల్దార్ పద్మావతమ్మ, ఎంఈఓ యశోద తదితరులు పాల్గొని బడి ఈడు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు సంజీవుడు సిఆర్పి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. పార్నపల్లి గ్రామంలో ఎంపీడీవో గాయత్రి ఎంఈఓ మోహన్ రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఆబుదూర్ రాఫీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, గ్రామస్తులు పిల్లల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు ఉన్నాయని, తల్లిదండ్రులు ఈ విషయంలో ఎలాంటి అపోహలకు పోకుండా పిల్లలను పాఠశాలల్లో చేర్పించి, వారి భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే పునాది అన్న విషయాన్ని గుర్తించి, విద్యాభివృద్ధిలో పాలుపంచుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. మిట్ట మధ్యాహ్నం ఎండను సైతం లెక్కచేయకుండా అధికారులు గ్రామాలలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.




# విద్యార్థుల భవిష్యత్తా? వ్యాపారమా?

**నంద్యాల సిటీ బ్యూరో మే 20 ( నంది పత్రిక )** “చదువుకోవాలనే ఆశ ఉంది... కానీ కట్టడానికి ఫీజు లేదు...“ – ఇది ఇవాళ ఎంతో మంది మధ్యతరగతి విద్యార్థుల ఆవేదన. ప్రతిభ ఉన్నా, మార్కులు వచ్చినా, ప్రైవేట్ కాలేజీల గడప తొక్కాలంటేనే గుండె గుభేల్ మంటోంది. విద్యాసంస్థలు విజ్ఞానాన్ని పంచే దేవాలయాలా? లేక కాసులు కురిపించే వ్యాపార కేంద్రాలా? ఈ రోజు మన ప్రత్యేక కథనం... “ప్రైవేట్ కాలేజీల మాయాజాలం – మధ్యతరగతి ఆక్రందన“.మీరు మీ పిల్లలను ప్రైవేట్ కాలేజీలలో చేర్పిస్తున్నారా? అయితే ఒక్క నిమిషం ఆలోచించండి! మీ పిల్లవాడికి 80 శాతం రానీయండి, 90 శాతం రానీయండి, లేక 99 శాతంతో టాపర్‌గా నిలవనీయండి... కార్పొరేట్ కాలేజీల కంటికి మాత్రం మీ పిల్లోడి ప్రతిభ కనిపించదు. వారికి కావాల్సింది కేవలం... ఫీజు! ఫీజు! ఫీజు! అక్కడ మెరిసే ర్యాంకుల వెనుక, విద్యార్థుల మార్కుల వెనుక కేవలం వ్యాపార కోణం మాత్రమే దాగి ఉందనేది నేటి పచ్చి నిజం. ఒకప్పుడు వడ్డీ వ్యాపారి దగ్గరకు వెళ్తేనే భయపడే పరిస్థితి ఉండేది. కానీ ఇవాళ కాలేజీ యాజమాన్యాల ముందు ఆ వడ్డీ వ్యాపారులు కూడా సరిపోరనే విమర్శలు వినిపిస్తున్నాయి. మానవత్వాన్ని మరిచి, విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని అస్సలు పట్టించుకోకుండా ప్రైవేట్ సంస్థలు వ్యవహరిస్తున్నాయి. ఒక అడుగు ముందుకేసి, ఫీజు బాకీ ఉన్నట్టు తల్లిదండ్రులను పిలిపించి... బలవంతంగా లిఖితపూర్వక ఒప్పందాలపై సంతకాలు చేయించుకుంటున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.మధ్యతరగతి కుటుంబాల జీవితాలు చాలా విచిత్రమైనవి. ఒకపూట ఉపవాసమైనా ఉంటారు కానీ, సమాజంలో ఆత్మగౌరవాన్ని కోల్పోవడానికి ఇష్టపడరు. కాలేజీ యాజమాన్యాల నుంచి వచ్చే ఫీజు ఒత్తిళ్లను తట్టుకోలేక, గడువు అడగడానికి అహం అడ్డొచ్చి... యాజమాన్యాలు ఆడే సూటిపోటి మాటలకు మనస్తాపం చెంది ఎంతో మంది ప్రతిభావంతులైన విద్యార్థులు తమ చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. మరికొందరు డిప్రెషన్‌లోకి వెళ్తున్నారు. అందుకే... విద్యార్థులకు, తల్లిదండ్రులకు మా విజ్ఞప్తి. అడ్మిషన్ల సమయంలో కాలేజీలు కురిపించే కపట ప్రేమలను, ఇచ్చే ఉచిత ఆఫర్లను చూసి మోసపోకండి. చేరే ముందే కాలేజీ లోపల ఉండే అసలు నియమ నిబంధనలు ఏంటి? ఫీజుల విషయంలో వారి ప్రవర్తన ఎలా ఉంటుంది? అనేది వంద సార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోండి. విద్యాసంస్థలు కూడా కేవలం లాభాపేక్షే కాకుండా, ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించే మానవత్వాన్ని చాటుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# దేశవ్యాప్తంగా కెమిస్టుల బంద్ విజయవంతం

**నంద్యాల ప్రతినిధి. మే 20 . (నంది పత్రిక ):**దేశవ్యాప్తంగా కెమిస్టులు మరియు డ్రగ్గిస్టులు పిలుపు మేరకు ఒక రోజు టోకెన్ బంద్ను విజయవంతంగా నిర్వహించినట్లు నంద్యాల జిల్లా రాష్ట్ర కెమిస్ట్స్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొబ్బిటి దామోదర్ రెడ్డి,కార్యదర్శి బైసాని రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ మరియు నియంత్రణలేని ఆన్లైన్ మందుల విక్రయాలు, ప్రజారోగ్యంపై వాటి ప్రభావం, అలాగే లక్షలాది చిన్న కెమిస్టుల జీవనోపాధిపై ఏర్పడుతున్న తీవ్రమైన సమస్యలకు వ్యతిరేకంగా ఈ బంద్ నిర్వహించారు.ఏఐఓసిడి మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కెమిస్ట్స్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు, నంద్యాల జిల్లా పరిధిలోని అన్ని కెమిస్టులు మరియు డ్రగ్గిస్టులు తమ దుకాణాలను మూసివేసి ఈ ఉద్యమానికి ఏకగ్రీవ మద్దతు తెలిపారు.బంద్ సందర్భంగా, గౌరవ ప్రధానమంత్రి కి ఉద్దేశించిన వినతిపత్రాన్ని డివిజనల్ కమిషనర్/జిల్లా కలెక్టర్/ ఎస్.డి.ఎం. / తహసీల్దార్ ద్వారా సమర్పించి, ప్రభుత్వం దృష్టికి క్రింది అత్యంత కీలకమైన అంశాలనుతీసుకువెళ్లారు.మందులు సాధారణ వస్తువులు కావని, సరైన ధృవీకరణ లేకుండా ఆన్లైన్ ద్వారా నియంత్రణలేని విక్రయాలు జరగడం ప్రజారోగ్యానికి, రోగుల భద్రతకు మరియు డ్రగ్స్ కాస్మెటిక్స్ చట్టం కింద ఏర్పాటు చేసిన నియంత్రణ వ్యవస్థకు తీవ్రమైన ముప్పుగా మారుతుందని కెమిస్టులు మరియు డ్రగ్గిస్టులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.కోవిడ్ మహమ్మారి సమయంలో దేశవ్యాప్తంగా కెమిస్టులు ముందుండి ప్రజలకు నిరంతరాయంగా మందుల సరఫరా చేసి ఆరోగ్య సేవల్లో కీలక పాత్ర పోషించారని ఔషధ వ్యాపారవర్గాలుగుర్తుచేశాయి.అక్రమ ఆన్లైన్ కార్యకలాపాలపై పలు మార్లు ఆధారాలతో కూడిన వినతులు సమర్పించినప్పటికీ, సంబంధిత అధికారులు ఇప్పటివరకు సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.రోగుల భద్రత, ప్రజారోగ్యం, అలాగే లక్షలాది చిన్న లైసెన్స్ కలిగిన కెమిస్టులు మరియు వారి ఉద్యోగుల రక్షణ దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం తక్షణ సరిదిద్దే చర్యలు తీసుకోవాలని కెమిస్టుల సంఘం విజ్ఞప్తి చేసింది.జిల్లా / రాష్ట్ర వ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా కొనసాగి, కెమిస్టులు మరియు డ్రగ్గిస్టుల నుండి విశేష మద్దతు లభించింది.అసోసియేషన్ తన మానవతా బాధ్యతను నిర్వర్తిస్తూ, అత్యవసర అవసరాలున్న రోగులకు అవసరమైన మరియు అత్యవసర మందులను అందుబాటులో ఉంచిందన్నారు.



## భూమిని విషం గా మార్చకండి...

### ఏవో రంగ నేతాజీ



**చాగలమర్రి మే 20 నంది పత్రిక** రైతులు తమ పంటలకు పరిమితికి మించి యూరియా తల్లి భూమిని విషముగా మార్చకూడదని మండల వ్యవసాయ శాఖ అధికారి రంగ నేతాజీ అన్నారు. బుధవారం ముత్యాలపాడు గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రసానిక ఎరువులు వాడడం వలన కలిగే దుష్ప్రభావాలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రస్తుత ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులలో రసాయనక ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. సాగు చేస్తున్న పంట రకాలు, నీటిపారుదల, ఎరువుల యాజమాన్యం ద్వారా దిగుబడి ఆధారపడుతుందన్నారు. కానీ కొన్ని చిన్న చిన్న సాగు చేసే విషయంలో లోపాలు చేయడం సహజమేనని వాటి కారణం చేత నేల కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. అందుకే రైతులందరూ యూరియా వాడకం సాధ్యమైనంత తక్కువగా వినియోగించాలని కోరారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తూ పంటలు సాగు చేయాలని మన భవిష్యత్తు తరాలకు చౌడుబారిన నేలను కాకుండా సారవంతమైన భూములను అందించాలన్నారు. తక్కువ పెట్టుబడి తో మంచి నాణ్యమైన దిగుబడులు సాధించడం లక్ష్యంగా ముందడుగు వేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సురేషు, రైతులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన బంద్




**చాగలమర్రి మే 20 నంది పత్రిక** తమ డిమాండ్ల సాధన కోసం అఖిలభారత కెమిస్ట్, డ్రగ్గిస్ట్ సంఘం పిలుపుమేరకు బుధవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. స్వచ్ఛందంగా మెడికల్ షాపులను తెరవకుండా మూసి వేయడం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ షాప్ యజమానులు మాట్లాడుతూ ఆన్లైన్ ఔషధ విక్రయాలపై రాము పోరాటం చేస్తున్నామని తెలిపారు. కోవిడ్ సమయంలో కేంద్రం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలన్నారు. ఆన్లైన్ సేవలో నకిలీ ప్రమాదకర మందులను సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారని ఆన్లైన్ సేవలను రద్దు చేయాలన్నారు. బంద్ కార్యక్రమంలో ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా బంద్ నిర్వహించారు. ఈ సమ్మెలో అపోలో, ఫార్మసీ, మెడ్ ప్లస్, తదితర మందుల షాపు యజమానులు తోమంద్రు రామకృష్ణ బాబు, నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని నాయకులకు పిలుపునిచ్చిన ఫిరోజ్.



**నంద్యాల సిటీ బ్యూరో మే 20 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ నందు నంద్యాల నియోజకవర్గ క్లస్టర్ మరియు మండల నాయకులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి చీఎస ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేస్తూ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వార్డు మరియు గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి బలమని, వారి కృషితోనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. అలాగే మండల / క్లస్టర్ల పరిధిలో పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడానికి క్లస్టర్ ,యూనిట్ ఇంచార్జిలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు ముందుండాలని, ప్రతి ఇంటికి పార్టీ సందేశాన్ని తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అదే విధంగా తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టత్మకంగా నిర్వహించే మహానాడు -2026 హైబ్రిడ్ మోడల్ కార్యక్రమాన్ని క్లస్టర్ వారిగా ఈ నెల 27,28 వ తేదీన అంగరంగా వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ మండల నాయకులు, క్లస్టర్ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## అధిక యూరియా వాడకం నేల తల్లికి ప్రమాదం



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 20:** రైతులు తమ పొలాల్లో యూరియాను అధికంగా వాడితే అనర్థాలు జరుగుతాయని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఎర్రగుంట్ల గ్రామంలో రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు యూరియాను అధికంగా వినియోగించడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతిని దీర్ఘకాలిక ఉత్పాదకత తగ్గుతుందని పేర్కొన్నారు. రైతులు రసాయనాల వినియోగాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడుకోవాలని సూచించారు. అధిక రసాయనాల వాడకం వల్ల పర్యావరణం నేలతల్లి ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. పురుగుల మందుల ప్రభావం వల్ల రైతులకు మేలు చేసే వానపాములు మిత్ర పురుగులు కూడా నశిస్తాయని అన్నారు. ప్రస్తుత ఎల్ నైనో అధిక ఉష్ణోగ్రత పరిస్థితుల్లో వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు వేసుకోవాలని, చిరుధాన్యాలు నవధాన్యాలు వేసుకొని అధిక ఆదాయం పొందాలని రైతులకు సూచించారు. 50 శాతం రాయితీతో వ్యవసాయ యంత్రాలు పనిముట్లు రోటవేటర్ల కొరకు ఈ నెల 26వ తేదీ వరకు గడువును పొడిగించడం జరిగిందని రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది ఆయేషా, వెటర్నరీ సిబ్బంది సతీష్ తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు

## కర్ణాటక మద్యం పట్టివేత



**మంత్రాలయం , మే 20,** మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం చెక్ పోస్టు దగ్గర అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని చెక్ పోస్టు సిఐ ప్రసాద్ రావు సోమవారం పట్టుకున్నారు. ఆయన తెలిపిన మేరకు మధ్యాహ్నం 1గంటకు ప్రాంతంలో మాధవరం చెక్ పోస్ట్ వద్ద సిబ్బంద తో వాహనాలు తనిఖీ చేయగా ఆదోని పట్టణము హనుమాన్ నగర్ చెందిన బోయ సుబ్బమ్మ అనే మహిళ గిల్సుగురు నుండి మాధవరం చెక్ పోస్ట్ వద్ద 196 కర్ణాటక ఒరిజినల్ ఛాయిస్ విస్కీ (90 ఎంఎల్ మద్యం తరలిస్తుండగా మహిళను అరెస్ట్ చేసీ , మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ కానిస్టేబుల్ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు

## అధిక యూరియా వాడకం నేల తల్లికి ప్రమాదం

### రైతులకు మండల వ్యవసాయ అధికారి స్వాతి సూచనలు



**వెలుగోడు, మే 20 (నంది పత్రిక):** రైతులు తమ పొలాల్లో యూరియాను అధికంగా వినియోగిస్తే నేల ఆరోగ్యం దెబ్బతిని దీర్ఘకాలికంగా పంట ఉత్పాదకత తగ్గిపోతుందని మండల వ్యవసాయ అధికారి స్వాతి హెచ్చరించారు. బుధవారం వెలుగోడు పట్టణంలోని స్థానిక సెంటర్ నుండి రైతు సేవ కేంద్రం వరకు రైతులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన అధిక వినియోగం వల్ల నేల సారవంతం తగ్గి పర్యావరణం సమతుల్యతపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రకృతిని కాపాడుకునేందుకు రైతులు రసాయనాల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ సాంకేతికతను ప్రోత్సహించాలని సూచించారు. పురుగుల మందుల ప్రభావంతో రైతులకు మేలు చేసే వానపాములు, మిత్ర పురుగులు కూడా నశిస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎల్నినో ప్రభావం, అధిక ఉష్ణోగ్రతల పరిస్థితుల్లో వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు, చిరుధాన్యాలు, నవధాన్యాలు సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చు అన్నారు. అలాగే 50 శాతం రాయితీతో వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, రోటవేటర్ల దరఖాస్తుల గడువు ఈ నెల 26వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అభివృద్ధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నగరంలోని నిషేదిత ప్రాంతాల్లో ప్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠినచర్యలు.

### డిప్యూటీ కమిషనర్ అమరయ్య.



**తిరుపతి బ్యూరో చీఫ్ మే 20నంది పత్రిక** నగరపాలక సంస్థ పరిధిలోని నిషేదిత ప్రాంతాల్లో ప్లెక్సీలు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వులు నంబరు 253 తేది: 02 -12 -2025, మేరకు తిరుపతి నగరపాలక సంస్థ పరిదిలో నగరపాలక సంస్థ నుండి అనుమతి లేకుండా ఎటువంటి ప్లెక్సీలు, బ్యానర్లు కట్టకూడదని తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిదిలోని అన్ని కూడళ్లలో, రోడ్డు డివైడర్లలో, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ వారి ఉత్తర్వుల మేరకు గరుడ వారది పైన, పిల్లర్లకు, గరుడ వారది పిల్లర్లకు మధ్య గల డివైడరు లందు, నగర పరిది లోని అన్ని పుట్ పాత్ ల పైన ప్లెక్సీలు, బ్యానర్లు కట్టుట నిషేదించామని తెలిపారు. నగర పాలక సంస్థ అనుమతి లేని వారికీ ప్లెక్సీలు, బ్యానర్లు ప్రింట్ చేయకూడదని, కట్టకూడదని ప్రింటింగ్ యజమానులకు సూచించారు. నగరపాలక సంస్థ పరిదిలోని, చుట్టూ ఉన్న పంచాయతీలోని అన్ని ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్ ల యజమానులు, వ్యాపార వేత్తలు, రాజకీయ పార్టీల వారు నగరంలోని నిషేదిత ప్రాంతాల్లో ప్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకుండా నగరపాలక సంస్థకు సహకరించాలని తెలిపారు. నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించి, చట్టపరమైన చర్యలు తీసుకోబడుతుందని, డిప్యూటీ కమిషనర్ అమరయ్య ఆ ప్రకటనలో హెచ్చరించారు.

## శ్రీ మద్దులేటి స్వామి టెంపుల్ లో అగ్నిమాపక సిబ్బంది అవగాహన.



**బేతంచెర్ల మే20 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివార్లలో వెలసి ఉన్న శ్రీ మద్దులేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నందు పనిచేయు సిబ్బందికి, అగ్నిప్రమాదాలు మరియు తొక్కిసలాట సంభవించినప్పుడు క్షత గాత్రులను, ఏ విధంగా రక్షించాలో రెస్క్యూ పద్ధతుల ద్వారా, ప్రయోగ పూర్వకంగా డోన్ అగ్నిమాపక సిబ్బంది బుధవారంనాడు శ్రీమద్దు లేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం సిబ్బందికి అవగాహణ కార్యక్రమంను నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపకమిషనర్ & దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలి

### ఎమ్మిగనూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అధికారి ఎస్ఎండి ఖాద్రి



**మంత్రాలయం , మే 20** :- విత్తనాలు , ఎరువుల స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని మండలలోని ఎరువుల దుకాణదారులకు ఎమ్మిగనూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అధికారి ఎస్ఎండి ఖాద్రి సూచించారు. సోమవారం ఖరీఫ్-2026 సీజన్‌కు సంబంధించిన ముందస్తు సన్నద్ధతలో భాగంగా మండల వ్యవసాయాధికారి జీరాగణేష్ తో కలిసి మంత్రాలయం మండల ఇన్‌పుట్ డీలర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు మరియు ఎరువుల స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలి. బిల్ బుక్స్ మరియు ఈ-పాస్ విక్రయాల నమోదులను సరిగా నిర్వహించాలి. డీబీటీ నమోదు చేసిన వివరాలు జారీ చేసిన బిల్లులకు పూర్తిగా అనుగుణంగా ఉండాలి. పానిక్ సేల్స్ చేయరాదు. అనధికారిక అంతర్రాష్ట్ర ఎరువుల రవాణా నిషేధం. సబ్సిడీ ఎరువులను పారిశ్రామిక అవసరాలకు మళ్లించరాదు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఎరువులు మరియు ఇతర వ్యవసాయ ఇన్‌పుట్లను పొదుపుగా, శాస్త్రీయ పద్ధతిలో వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలి. అధిక మోతాదులో యూరియా వినియోగించకుండా రైతులకు సూచనలు ఇవ్వాలి. అవసరానికి మించి యూరియా వినియోగించడం వల్ల చీడపీడలు మరియు వ్యాధులు పెరిగి రైతుల సాగు ఖర్చులు అధికమయ్యే అవకాశం ఉందని తెలిపారు. భారతి మాత బచావో"లో భాగంగా నేల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా భూసారాన్ని కాపాడడంతో పాటు పర్యావరణాన్ని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## తేనీటి తరంగాలు



**నంది పత్రిక:** టీ జన జీవితాన్ని శాసిస్తుంది ఉదయం టీతోనే మొదలౌతుంది. సాయంత్రం టీతోనే సేదతీరుతుంది ఇంటి మర్యాదకుటీ ప్రతీకగా నిలుస్తుందికొత్త స్నేహాలకు స్వాగతంఉన్న స్నేహాలబలోపేతానికివారధి టీ పచ్చని తోటల్లో చిగురించిప్రతి ఇంట కమ్మనిసువాసనలు వెదజల్లే అమృతం టీటీకి కుల మత బేధాలు పేద ధనిక తారతమ్యాలు లేవు. సామాజిక సమరసతకు సారథి టీచిన్న గ్లాసైన పింగాణికప్పైన టీ పంచేహాయి ఒకటే టీ ఇచ్చే ఉత్సాహం ఒకటేటీ ఒంటరి తనానికి తోడుగానిలిచే స్నేహితుడు టీ స్నేహితుల ముచ్చట్లలో మునిగిపోయే సాక్షికి ప్రతీక తేనీటితరంగాలుఆలోచన తరంగాలకు నూతన జీవన తరంగాలకుసృజనవిశ్లేషణకుఆయువుపట్టై ఆలోచనల ప్రవాహానికి ఒక ఊతం ఇస్తుంది. అలసిన మేనికి టీ ఒక సంజీవనిగాపనిచేస్తుందిటీ అల్లం ముక్కల ఘాటుతోయాలకుల గుబాళింపులోచక్కని పాలతో చిక్కని రంగుతో ప్రతి గుట్కాలోకొత్త లోకాన్ని చూపిస్తుంది. ప్రపంచాన్ని అంతటినిఒకతాటిపైకితెస్తుంది. ప్రజాసంబంధాల వారధి అన్ని వర్గాలఆత్మబంధువు టీ టాటా బై బై లకుటీతో ట్రీట్ చేద్దాం. టీ కప్పుతోపగలుసెగలుప్రతీకారాలు మానుకుందాం. మానవమనుగడకు పాటుపడుదాం. నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం కరీంనగర్. (మే21 అంతర్జాతీయ టీ దినోత్సవం సందర్భంగా)

## సామిల్లు, కలప డిపో యజమానులకు ఎన్ టి పి ఎస్ పై అవగాహన కార్యక్రమం

### డిజిటల్ విధానంతో అటవీ ఉత్పత్తుల రవాణా మరింత సులభం

**వెలుగోడు, మే 20 (నంది పత్రిక):** వెలుగోడు రేంజ్ పరిధిలోని సామిల్లు మరియు ప్రైవేట్ కలప డిపో యజమానులకు జాతీయ ట్రాన్సిట్ పాస్ వ్యవస్థ పై ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెలుగోడు, వెలుగోడు మరియు ఆత్మకూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఆధ్వర్యం వహించారు. కార్యక్రమంలో వెలుగోడు రేంజ్ అసిస్టెంట్‌తో పాటు స్థానిక సామిల్లులు, కలప డిపో యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ అటవీ ఉత్పత్తుల రవాణాను వేగవంతం చేయడం, పారదర్శకత పెంపొందించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ ట్రాన్సిట్ పాస్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని తెలిపారు. కలప, వెదురు మరియు ఇతర చిన్న అటవీ ఉత్పత్తుల రవాణాకు అవసరమైన అనుమతులను ఆన్లైన్ ద్వారా సులభంగా పొందేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. వ్యాపారులు మరియు డిపో యజమానులు అటవీ కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా వెబ్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొని దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. అటవీ జాతుల వర్గీకరణ ఆధారంగా ట్రాన్సిట్ పర్మిట్, నో అబ్జెక్షన్ సర్టిఫికేట్లను ఆన్లైన్ ద్వారానే జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ-పేమెంట్ సదుపాయం ద్వారా రవాణా అనుమతుల కోసం ఆన్లైన్లోనే చెల్లింపులు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒకే జాతీయ ట్రాన్సిట్ పాస్ ద్వారా దేశవ్యాప్తంగా అంతర్రాష్ట్ర మరియు రాష్ట్ర అంతర్గత రవాణాను ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగించవచ్చని చెప్పారు.

ఈ డిజిటల్ విధానం అమల్లోకి రావడంతో పాత పేపర్ ఆధారిత విధానం పూర్తిగా రద్దుకానుందని, చెక్‌పోస్టుల వద్ద అనవసర ఆలస్యాలు తగ్గడంతో పాటు సమయం, రవాణా ఖర్చులు ఆదా అవుతాయని అధికారులు వివరించారు. వెలుగోడు రేంజ్ పరిధిలోని సామిల్లులు, కలప డిపోల యాజమాన్యాలు ఈ ఆధునిక ఆన్లైన్ వ్యవస్థను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ శాఖ అధికారులు, సిబ్బంది, సామిల్లు మరియు కలప డిపో యజమానులు పాల్గొన్నారు.



# తుడుములదిన్నె హత్యాయత్నం కేసులో ఇరువురు అరెస్ట్

## డీఎస్పీ శ్రీనివాసరావు

## పోలీసుల అదుపులో ముగ్గురు బాల నేరస్తులు

## డిఎస్పి శ్రీనివాసరావు

**ఆళ్లగడ్డ, ప్రతినిధి మే 20 నంది పత్రిక** నియోజకవర్గంలోని ఉయ్యాలవాడ మండలంలోని తుడుములదిన్నె సమీపంలో జరిగిన హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీనివాసరావు బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 16వ తేదీ రాత్రి సుమారు 8:15 గంటల సమయంలో మాయలూరుతుడుములదిన్నె రహదారిలోని రైల్వే అండర్‌పాస్ వద్ద ఈ ఘటన జరిగింది. తుడుములదిన్నె గ్రామానికి చెందిన టైలర్ ఇమ్రాన్ ట్రాక్టర్‌పై వెళ్తుండగా ముద్దాయిలు బైక్‌లపై వచ్చి ట్రాక్టర్‌ను అడ్డగించి దాడి చేశారు. ప్రేమ వ్యవహారం నేపథ్యంలో ఇమ్రాన్‌పై క్రికెట్ బ్యాట్లు, రాళ్లతో దాడి చేసి, అనంతరం పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు. ప్రాణభయంతో ఇమ్రాన్ సమీపంలోని నీటి కుంటలోకి దూకి తప్పించుకున్నాడు. ఈ ఘటనలో ట్రాక్టర్ నడుపుతున్న హరిచంద్ర ప్రసాద్ అలియాస్ బద్రి అడ్డుగా రావడంతో అతనిపై కూడా ముద్దాయిలు కులం పేరుతో దూషిస్తూ దాడి చేసినట్లు పేర్కొన్నారు. గాయపడిన ఇమ్రాన్ ప్రస్తుతం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



అతని ఫిర్యాదు మేరకు ఉయ్యాలవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భోగ్యం వెంకట స్వామి అలియాస్ బోయ వెంకట స్వామి, పణ్యం మణివర్ధన్ అలియాస్ మణిని పోలీసులు అరెస్ట్ చేయగా, మరో ముగ్గురు బాల నేరస్థులను అదుపులోకి తీసుకున్నారు. ముద్దాయి కూతురు ఇమ్రాన్‌తో ప్రేమలో ఉందనే అనుమానంతో గ్రామంలో పుకార్లు రావడంతో, అతనిపై కక్ష పెంచుకుని హత్యాయత్నానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. బుధవారం మధ్యాహ్నం ఉయ్యాలవాడ రహదారిలోని చింతకుంట్లపాంపల్లె క్రాస్ వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో

సీఐ బీవీ రమణ, ఎస్ఐ పి.రామిరెడ్డి మరియు సిబ్బంది పంచాయతీదారుల సమక్షంలో ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

## అహోబిలం హత్య కేసులో నిందితుడు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

### డి.ఎస్.పి, ఎ శ్రీనివాసరావు



**ఆళ్లగడ్డ ప్రతినిధి మే20నంది పత్రిక** మండలం లోని అహోబిలం గ్రామంలో ఈనెల 14న జరిగిన హత్య కేసులో ప్రధాన ముద్దాయిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఆళ్లగడ్డ డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ప్రత్యేకపర్యవేక్షణలో, డీఎస్పీ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ రూరల్ సర్కిల్ సీఐ బీవీ రమణ, ఎస్ఐ వరప్రసాద్‌లు ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి ముద్దాయిని అదుపులోకి తీసుకున్నారు. డి.ఎస్.పి చెప్పిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అహోబిలం గ్రామానికి చెందిన కొమెర శివ అలియాస్ వల్లెపు శివ (27) మరియు నారాయణపురం గ్రామానికి చెందిన ఎరుకలి శంకర్ ఇద్దరూ అహోబిలంలో ఒకే షెడ్డులో నివసించడం జరిగేది. ఇరువురికి మద్యం సేవించే అలవాటు ఉందన్నారు. ఈ నెల 14వ తేదీ రాత్రి మద్యం సేవిస్తున్న సమయంలో చికెన్ వండడంపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో శంకర్ అవమానకరంగా దూషించడంతో మనస్తాపానికి గురైన శివ, మద్యం మత్తులో నిద్రలో ఉన్న శంకర్‌పై రోకలి బండతో తలపై దాడి చేశాడు. ఈ దాడిలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 49/2026గా, బీఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా మే 20వ తేదీ ఉదయం 10.45 గంటలకు ఆళ్లగడ్డఅహోబిలం రహదారిలోని పడకండ్ల గ్రామం సమీపంలోని దుర్గామాత ఆలయం వద్ద ముద్దాయి వడ్డె శివను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం అతనిని న్యాయస్థానంలో హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి..

### ఎంపీడీవో డి. గోపికృష్ణ



**జూపాడుబంగ్లా: మే: 20: (నంది పత్రిక )** జూపాడు బంగ్లాలో ప్రభుత్వం చేపట్టిన బడి పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం జంగాల పేట పాఠశాల పరిధిలోని ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ చిన్న మద్దిలేటి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డి. గోపికృష్ణ, ఎంఈఓ చిన్న మద్దిలేటి మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనము యూనిఫారంలు నాణ్యమైన బోధన వంటి సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని విద్యార్థి తల్లిదండ్రులను కోరారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా బోధన చేసి ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్ పి హెచ్ ఎస్ హెడ్ మాస్టర్ డి. హుస్సేన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## రూపాయి విలువ పడిపోకుండా ఆర్బీఐ కీలక నిర్ణయం

భారత కరెన్సీ రూపాయి రోజురోజుకూ క్షీణిస్తోంది. రూపాయితో డాలర్ మారకం విలువ 96ను దాటి పడిపోయింది. దీంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రంగంలోకి దిగింది. ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్ వ్యవస్థలోకి నగదు లభ్యతను పెంచడానికి 5 బిలియన్ డాలర్ల విలువైన డాలరు - రూపాయి బై, సెల్ స్వాప్ వేలాన్ని చేపట్టనుంది. మే 26వ తేదీన వేలం ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో రూపాయి విలువ పతనమవుతోంది. దీంతో బై, సెల్ స్వాప్ వేలం నిర్ణయం తీసుకుంది. పరిస్థితులకు అనుగుణంగా మూడేళ్ల కాలపరిమితితో రూపాయి

# గాలి వాన బీభత్సం..

### నేలకొరిగిన చెట్లు, వర్షంతో తడిసిన ధాన్యం



**చాగలమర్రి మే 20నంది పత్రిక** గాలివాన బీభత్సంతో మండలంలో ని చాగలమర్రిలో చెట్లు నేలకొరిగాయి. అకాల వర్షంతో నూర్పిడి చేసిన వరి మొక్కజొన్న ఆరబోయడంతో తడిసి ముద్దయ్యాయి. మంగళవారం ఉరుములు మెరుపులతో గాలి వాన రావడంతో వేడితో ఉన్న నేల కొంతమేర చల్లబడిన రైతుకు మాత్రం కన్నీళ్లు మిగిల్చాయి. దానిమ్మ, జామ, మామిడి, తదితర పండ్లు గాలికి రాలిపడ్డాయి. దీంతో రైతులు దిగాలు పడ్డారు. రోడ్డు వెంబడి ఆరబోసిన జొన్న ధాన్యం తడిసి ముద్దయింది. రాత్రి సుమారు గంటకు పైగా గాలి, ఉరుములు మెరుపులతో వర్షం పడడంతో గొర్రెల కాపరులు, పశు వుల కాపరులు పొలంలో నుండి బీతిల్లిపోయి ఇంటికి పరుగెత్తారు.

## పెండింగ్ అర్జీల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి

### ఆర్డీవో విశ్వనాథ్



**ఆళ్లగడ్డప్రతినిధి మే20,నంది పత్రిక** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో గత వారం నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆళ్లగడ్డ రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను ఆలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. తహశీల్దార్లు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి రత్న కుమారి, సర్వేర్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## కొలతల ప్రకారం పనులు చేయండీ

### - ఏపీఓ విమలమ్మ

**కొత్తపల్లి - నంది పత్రిక :** ఉపాధి వేతనదారులు ఎన్ఆర్ఆజీఎస్ సిబ్బంది ఇచ్చిన కొలతల మేరకు పనులు చేయాలని ఏపీఓ విమలమ్మ సూచించారు. బుధవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని బండినాయిని పాలెం పొలిమేరలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి వేతన ధారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వేతనదారుడు ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం పనులు చేయాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తేనే తగిన వేతనం అందుతుందన్నారు. మస్టర్లను తప్పులేకుండా నిర్వహించాలన్నారు. అదేవిధంగా రెండు పోటోలు తప్పనిసరిగా తీయించుకోవాలన్నారు. అదేవిధంగా 5 ఎకరాలు ఉన్న చిన్న సన్నకారు రైతులు మామిడి, ఖర్జూర, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, టేకు, సపోట, ఇతర పండ్ల రకాల మొక్కలను నాటుకొనేందుకు ముందుకు రావాలన్నారు. హర్టికల్చర్ వ్యవసాయ సాగుచేసుకొనేందుకు ముందుకు రావాలని సూచించారు. హర్టికల్చర్ వ్యవసాయం ద్వారా రైతుల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆమె వెంట టెక్నికల్ అసిస్టెంట్ మజహార్, ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణ్ కుమార్, తదితరులు ఉన్నారు.



## ఉజ్వల భవిష్యత్తు ప్రభుత్వ పాఠశాలల్లోనే -ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించండి

### - మండల ప్రత్యేక అధికారి చింతామణి



**కొత్తపల్లి - నంది పత్రిక:** ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండల ప్రత్యేక అధికారి చింతామణి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఎంఈఓ -2 ఇనాయతుల్లా ఆధ్వర్యంలో బడిపిలుస్తుంది. కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో అందించే ఎస్ఆర్ఎం కిట్ల ద్వారా అందిస్తున్న 21 రకాల వస్తుల గురించి, తల్లికివందనం, డొక్కా మాణిక్యమ్మ మధ్యహ్నభోజన పథకం, పీఎం శ్రీ పాఠశాలలో వసతుల కల్పన పై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలోని 280 మంది విద్యార్థులను 1వ తరగతిలో చేర్పించామన్నారు. అదేవిధంగా గ్రామంలో 13 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ఎక్కువ శాతం ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా ఆలోచించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## యూరియా వినియోగాన్ని రైతులు తగ్గించుకోవాలి

### - ఎ ఓ అమ్మిరున్నిసా బేగం




**కొత్తపల్లి - నంది పత్రిక:** మండలంలోని రైతులు యూరియా వినియోగాన్ని రైతులు తగ్గించుకోవాలని మండల వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం సూచించారు. బుధవారం మండల కేంద్రంలో యూరియా వినియోగంపై అవగాహన ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ యూరియా వాడి సాగు ఖర్చుని తగ్గించకోవాలని సూచించారు. అదేవిధంగా పంట వ్యర్థాలు పొలంలో కలియ దున్నడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడం, నీటి ఆదా చేయడం, పర్యావరణ పరిరక్షించుకోవచ్చునన్నారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం, పంట మార్పిడి, అవసరం మేరకే రసాయన ఎరువుల వాడకం అనే విషయాలను వెల్లడించారు. రాయతి పై యంత్ర పరికరాలకు దరఖాస్తు ఈ నెల 26 వ తేదీ వరుకు గడువు పెంచడం జరిగిందన్నారు. అవసరం ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసులు, రైతు సేవ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది. రైతులు పాల్గొన్నారు.

## వార్డుల విభజన అస్తవ్యస్తంగా రూపొందించిన మున్సిపల్ అధికారులు... తప్పులను సవరించాలని డిమాండ్ చేస్తున్న వైసీపీ నేతలు



**నంద్యాల సిటీ బ్యూరో మే 20 ( నంది పత్రిక )** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నంద్యాల మున్సిపాలిటీ లో ఉన్న 42 వార్డులను పునర్ విభజన చే స్తూ 52 వార్డులుగా మున్సిపల్ కమిషనర్ శేషన్న మరియు అధికారులు రూపొందించడం జరిగింది. అయితే ఈ పునర్విభజన చేసిన వార్డుల వివరాలను ప్రజల సలహాలు సూచనల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల నోటీస్ బోర్డులలో ప్రచురించాల్సి ఉన్నది. అయితే నిబంధనలు పాటించని మున్సిపల్ కమీషనర్ శేషన్న ఉద్దేశపూర్వకంగానే నేడు మున్సిపల్ కార్యాలయ నోటీస్ బోర్డులో ఉంచడం జరిగింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ తీరును అలాగే నేడు ప్రచురించిన మున్సిపల్ వార్డుల పునర్ విభజన వివరాలలో పొందుపరచిన అంశాలు అస్తవ్యస్తంగా నిబంధనల మేరకు లేవని వాటిని పునఃపరిశీలించి ప్రజల సౌకర్యార్థం రూపొందించాలని ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, మాజీ కౌన్సిలర్లు, వై సీపీ నాయకులు జిల్లా కలెక్టర్ మరియు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ ను విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి ప్రచురించిన వార్తుల విభజన పత్రాలపై పలు సందేహాలను, సవరణలను, సూచనలను ఎమ్మెల్సీ మరియు వైసీపీ నేతలు తెలియజేశారు. అనంతరం డిఆర్ఓ రామునాయక్ కు వైసీపీ నేతలు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి,జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి అమృతరాజ్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కారు రవికుమార్, వైసీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టివి రమణ, వైసీపీ జిల్లా సెక్రెటరీ దేవనగర్ బాషా, మాజీ కౌన్సిలర్స్ కన్నమ్మ, శాదిక్ భాష, ఆరీఫ్ నాయక్, కలాం బాష, సుబ్బరాయుడు, మేసా చంద్రశేఖర్, జాకీర్ హుస్సేన్, చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, వైసిపి నాయకులు సాయిరాం రెడ్డి, పార్థుడు,దండే సుధాకర్, భాస్కర్ రెడ్డి,రమేష్,కాల్వ నాగరాజు పాల్గొన్నారు.

# తీవ్రమైన వడగాల్పులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, చలివేంద్రాల ఏర్పాటుకు ఆదేశాలు**

**బహిరంగ పనులు ఉదయం, సాయంత్రం వేళల్లోనే నిర్వహించాలి**

**వడదెబ్బ నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, మే 20(నంది పత్రిక):–** రానున్న ఏడు రోజుల పాటు జిల్లాలో తీవ్రమైన వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. భారత వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు మధ్య మరియు ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ జిల్లాల్లో ఈనెల 20 నుండి 26 వరకు తీవ్రమైన వేడి పరిస్థితులు నెలకొనే అవకాశముందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితులు మినహా మధ్యాహ్న వేళల్లో ప్రజలు బయటకు రావద్దని సూచించారు. అవసరమైతే ఉదయం 9 గంటల లోపు లేదా సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే బయట పనులు చూసుకోవాలని తెలిపారు.

**ద్రవ పదార్థాలు తప్పనిసరిగా తీసుకోవాలి**

ఎండ తీవ్రత కారణంగా శరీరంలో నీటి శాతం తగ్గకుండా తరచూ తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ, తలపాగా, పలుచటి పత్తి దుస్తులు వినియోగించాలని తెలిపారు. చిన్నపిల్లలను వాహనాల్లో ఒంటరిగా వదిలివేయకూడదని హెచ్చరించారు.

**కార్మికుల రక్షణకు ప్రత్యేక చర్యలు**

పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఉపాధి హామీ పథకం మరియు ఇతర బహిరంగ పనుల్లో పనిచేసే కార్మికుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనులను తెల్లవారుజామున లేదా సాయంత్రం వేళల్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్మికులకు తాగునీరు, నీడ, విశ్రాంతి సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని సూచించారు.

**ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి**

వడగాల్పులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు వార్డు సచివాలయాలు, గ్రామ సచివాలయాలు, సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లు, ప్రజా ప్రకటన వ్యవస్థలను వినియోగించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డుల ద్వారా ఉష్ణోగ్రత హెచ్చరికలు, జాగ్రత్తల సూచనలు ప్రదర్శించాలని తెలిపారు.

**తాగునీరు, చలివేంద్రాల ఏర్పాటు**

బస్ స్టాండ్లు, మార్కెట్లు, కూడళ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, కార్మిక అడ్డాలు వంటి రద్దీ ప్రాంతాల్లో తగిన తాగునీటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అవసరమైన చోట చలివేంద్రాలు, తాత్కాలిక నీటి కియోస్క్‌లు, ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

**శీతలీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి**

మున్సిపల్ కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, వార్డు సచివాలయాలు మరియు ఇతర ప్రభుత్వ భవనాల్లో తాత్కాలిక విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బస్ స్టాప్‌లు, ట్రాఫిక్ జంక్షన్‌లు, మార్కెట్లు, అన్న క్యాంటీన్లు వంటి ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల్లో నీడ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**బలహీన వర్గాలకు ప్రత్యేక రక్షణ**

వృద్ధులు, నిరాశ్రయులు, వీధి వ్యాపారులు, పారిశుద్ధ్య కార్మికులు, నిర్మాణ కార్మికులు వంటి బలహీన వర్గాలను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించాలని అధికారులకు సూచించారు. వార్డు స్థాయి బృందాల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స సామగ్రి, తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

**వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స**

తలనొప్పి, అలసట, వాంతులు, అధిక దాహం, స్పృహ తప్పడం వంటి వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే బాధితులను సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సహాయం అందించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ప్రజలకు వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

**పారిశుధ్యం, నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి**

పట్టణ స్థానిక సంస్థలు పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగు కాలువల శుభ్రత పనులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి సరఫరా వ్యవస్థలను తనిఖీ చేసి లీకేజీలు వెంటనే సరిచేయాలని, క్లోరినేషన్ మరియు నీటి నాణ్యత పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.

**నియంత్రణ గదులు అప్రమత్తంగా ఉండాలి**

వేడి సంబంధిత ఫిర్యాదులు, తాగునీటి సమస్యలు, అత్యవసర పరిస్థితుల పరిష్కారం కోసం నియంత్రణ గదులు 24 గంటలు క్రియాశీలంగా ఉండాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేసుకుని తక్షణ స్పందన చర్యలు చేపట్టాలని సూచించారు.

**జంతువులు, పక్షుల కోసం నీటి ఏర్పాట్లు**

వీధి జంతువులు, పక్షుల కోసం పార్కులు, మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో నీటి గిన్నెలు, మట్టి కుండలు ఏర్పాటు చేసి వాటిని క్రమం తప్పకుండా నింపాలని పట్టణ స్థానిక సంస్థలకు సూచించారు.

**ముందస్తు చర్యలతో ప్రాణనష్టం నివారించాలి**

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎండ తీవ్రత వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు.

# వేసవిలో ఎండల పట్లప్రజలు అప్రమత్తంగా ఉండాలి.




**రుద్రవరం ప్రతినిధి మే 20 (నంది పత్రిక):** వేసవి లో ఎండలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం రుద్రవరం లోని మండల పరిషత్ సమావేశ భవనంలో మండల అధ్యక్షులు మబ్బు బాలస్వామి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ మాట్లాడుతూ పశువులకు దానాగా ఉపయోగించుకోవడానికి గడ్డి విత్తనాలు సబ్సిడీ తో ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. పశువులు ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు 1962 వాహనాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వేసవిలో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలో మండలంలో ఎక్కడ త్రాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. పది పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారని ఎంఈఓ వెంకటస్వామి రెడ్డి తెలిపారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని వ్యవసాయ అధికారి సుమతి తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచడం వల్ల భూమి సారవంతమవుతుందన్నారు. నవ ధాన్యాల పంటలు సాగు చేసుకోవాలన్నారు. పల్లెనిద్ర మొదటి విడత రెండో విడతగా మంజూరైన నిధులతో సిసి రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని పిఆర్ఏఈ కమల్ సాహెబ్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి వాతావరణ సమతుల్యతకు పాటుపడాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాణమ్మ కోరారు. రుద్రవరం మండలానికి నంద్యాల నంద్యాల నుంచి అదనంగా మరో బస్సును నడుపుతున్నట్లు ఆర్టిసి ప్రతినిధి కోటేశ్వరరావు తెలిపారు. అలాగే ఆలమూరు, చిత్రేనిపల్లి, ముకుందాపురం గ్రామాలకు ఆళ్లగడ్డ నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మండల సర్వసభ్య సమావేశంలో ఆయా శాఖలకు చెందిన అధికారులు వారి వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ చంద్రశేఖరయ్య, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి, ఈవో పీఆర్డి బాలాంజనేయులు, డాక్టర్ నాగ ప్రసన్న, మైనర్ ఇరిగేషన్ ఏఈ రఘురాం, విద్యుత్ ఏయి రాజశేఖర్, మండల పర్యవేక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, వెలుగు ఏపిఎం వసంత కుమారి, ఉపాధి ఏపీవో గౌరీ భాయ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రసీదా బేగం, ఉపాధి ఈసీ సుబ్బన్న, అయ్యా శాఖలకు చెందిన అధికారులు ఎంపీటీసీ సభ్యులు పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే నిర్వహించాలి

**మజ్దూర్ యూనియన్**



**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 20,నంది పత్రిక** రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి నిర్వహించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం ఆళ్లగడ్డ డిపో గ్యారేజీలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు యూనియన్ ఉపాధ్యక్షుడు కోటేశ్వరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వ రవాణా రంగాన్ని ప్రైవేటీకరణ దిశగా నడపడం కార్మికుల భవిష్యత్తుకు, ప్రజల ప్రయాణ సౌకర్యాలకు హానికరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల ప్రభుత్వ ఆదాయం తగ్గడంతో పాటు ఉద్యోగ భద్రత కూడా దెబ్బ తింటుందన్నారు. అందువల్ల ఎలక్ట్రిక్ బస్సులను పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనుగోలు చేసి, ఆపరేట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, రవాణా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ డీఏ బకాయిలు, లీవ్ పేమెంట్లను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఇతర నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు కే గంగాధర్ ఎం రోశయ్య, హెచ్ ఆర్ ఎన్ రావు ఏ రమణ,ఓంకార్, జనార్ధన్ , డిపో సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సున్నిపెంట భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు



**రూ.10 కోట్లతో సున్నిపెంటలో రోడ్లు, తాగునీటి అభివృద్ధి పనులు వేగవంతం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**సున్నిపెంట/నంద్యాల, మే 20(నంది పత్రిక):–** శ్రీశైలం డ్యామ్ పరిసర ప్రాంతాల అభివృద్ధి, భూముల వినియోగం, ప్రభుత్వ ప్రణాళికలు మరియు ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వెల్లడించారు. మంగళవారం సున్నిపెంటలో రూ.10 కోట్ల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఆస్తులన్నీ ప్రజలకే చెందుతాయని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రోడ్లు, పాఠశాలలు, డ్రైనేజీలు, ఆసుపత్రులు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సున్నిపెంట ప్రాంతంలో మరిన్ని డ్రైనేజీలు, అంతర్గత రహదారుల అవసరం ఉన్నట్లు గుర్తించామని, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే అంచనాలు సిద్ధం చేసి, త్వరలోనే పరిపాలనా మంజూరులు పొందేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'జలహారతి' కార్యక్రమం సందర్భంగా శ్రీశైలం డ్యామ్ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు, స్థానిక ఎమ్మెల్యే ప్రాంత అభివృద్ధి అవసరాలు, రహదారుల పరిస్థితిని వివరించారని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. శ్రీశైలం డ్యామ్ నిర్మాణ చరిత్రను ప్రస్తావిస్తూ, 1963 జూలై 19న డ్యామ్‌కు పునాది పడిందని గుర్తు చేశారు. అప్పట్లో ఈ ప్రాంతం మొత్తం అటవీ శాఖ పరిధిలో ఉండేదని, రిజర్వ్ ఫారెస్ట్ మరియు వైల్డ్‌లైఫ్ శాంక్చురీ నిబంధనలు అమలులో ఉన్నాయని తెలిపారు. అనంతరం డ్యామ్ నిర్మాణ అవసరాల కోసం అటవీ భూమిని డీ-రిజర్వ్ చేసి, 1964 నుంచి 1968 మధ్యకాలంలో సుమారు 1468 ఎకరాలను శ్రీశైలం డ్యామ్ నిర్మాణానికి కేటాయించారని, ప్రస్తుతం ఆ భూములు నీటి పారుదల శాఖ పరిధిలో ఉన్నాయని వివరించారు. ఇటీవల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించిన భూసర్వేలో కొండవాలు ప్రాంతాల్లో భూమి జారిపోవడంతో ప్రస్తుతం 1427 ఎకరాల 24 సెంట్ల భూమి అందుబాటులో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. సర్వే ప్రకారం ఈ ప్రాంతంలో ఇళ్లు, వాణిజ్య సముదాయాలు కలిపి మొత్తం 5,824 నిర్మాణాలు ఉండగా, 22 వేలకుపైగా జనాభా నివసిస్తున్నట్లు వెల్లడించారు. డ్యామ్ నిర్మాణం మరియు కాలువల నిర్మాణానికి సుమారు 450 ఎకరాల భూమిని వినియోగించారని తెలిపారు. మిగిలిన భూమిలో ఇరిగేషన్ శాఖ ఉద్యోగుల కోసం వివిధ కేడర్లకు చెందిన సిబ్బందికి సుమారు 2,360 క్వార్టర్స్ నిర్మించారని కలెక్టర్ చెప్పారు. అదనంగా పాఠశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు, ఆసుపత్రి, పోస్టాఫీస్, బ్యాంకులు తదితర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు భూములను కేటాయించారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ప్రజలు కూడా ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. సున్నిపెంట ప్రాంత భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలను సేకరించే ప్రక్రియను ప్రజల సౌలభ్యం దృష్ట్యా పొడిగించామని, ఇంకా సమస్యలపై దరఖాస్తులు ఇవ్వని వారికి గురు, శుక్ర, శనివారాల వరకు అదనపు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిపత్రం, రిటన్ స్టేట్మెంట్‌ను సమగ్రంగా పరిశీలించి క్రోడీకరించి ప్రభుత్వం మరియు గౌరవ న్యాయస్థానానికి పూర్తి స్థాయి నివేదిక సమర్పించనున్నట్లు కలెక్టర్ వివరించారు. గతంలో జారీ చేసిన జీవోలు, రెగ్యులరైజేషన్ విధానాలు, ప్రభుత్వ ఉత్తర్వులను సమగ్రంగా అధ్యయనం చేసి, సున్నిపెంట వాస్తవ్యులకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఉద్యోగులు లేదా రిటైర్డ్ ఉద్యోగులు అనే తేడా లేకుండా, ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు 125 ఎకరాల భూమి, సుమారు 2,300 ఇళ్లను సర్వే పరిధిలోకి తీసుకున్నామని, మిగిలిన ప్రాంతాలపై కూడా పూర్తి స్థాయి హోలిస్టిక్ అధ్యయనం చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు రిటన్ స్టేట్మెంట్ సమర్పించినందుకే వెంటనే ఖాళీ చేయించే పరిస్థితి ఉండదని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ముఖ్యంగా ఈ ఏడాది రోడ్ల నిర్మాణానికి కేటాయించిన రూ.25 కోట్లలో దాదాపు రూ.10 కోట్లు సున్నిపెంట ప్రాంతానికే మంజూరు కావడం ప్రజల పట్ల ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ, సున్నిపెంట గ్రామ ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు అందజేస్తున్న నోటీసులను స్వీకరించి, ప్రభుత్వం గతంలో జారీ చేసిన ఇంటి పట్టాలు, సంబంధిత పత్రాలను సమాధానంగా సమర్పించాలని ప్రజలకు సూచించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సున్నిపెంట ప్రజలకు అన్యాయం జరగనివ్వబోమని, గ్రామ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే రోడ్లు, త్రాగునీటి సదుపాయాల కోసం రూ.10 కోట్లు మంజూరు చేశామని, త్వరలోనే ఇంటింటికీ కుళాయి ద్వారా ప్రతిరోజూ తాగునీరు అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామంలోని ఎక్కువ భాగం వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయ్యిందని, మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. అర్హులైన వారికి పక్కా గృహాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ వెంకట శివ, పంచాయతీరాజ్ ఈఈ నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.



# 'కుర్చీ మడతపెట్టి' ఫేమ్ కుర్చీతాత కన్నుమూత

'కుర్చీ మడతపెట్టి' అనే ఒక్క డైలాగ్‌తో సోషల్ మీడియాలో సంచలనంగా మారిన షేక్ మహ్మద్ పాషా (64) బుధవారం కన్నుమూశారు. ఆయనను అందరూ 'కుర్చీతాత' లేదా 'కాలా పాషా'గా పిలుస్తుంటారు. మంగవారం మధ్యాహ్నం యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్క్ వద్ద ఎండ తీవ్రతకు తట్టుకోలేక స్పృహతప్పి పడిపోయారు. అపస్మారకస్థితిలో పడిఉన్న ఆయనను యూట్యూబర్ వైజాగ్ సత్య ఇంటికి చేర్చారు. నిన్న సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురై తన ఒడిలోనే ప్రాణాలు వదిలాడని భార్య ఆసియా సుల్తానా కన్నీటి పర్యంతమయ్యారు. వరంగల్‌కు చెందిన పాషా, సుమారు 40 ఏళ్ల క్రితం హైదరాబాద్ వచ్చి రహ్మత్‌నగర్‌లో స్థిరపడ్డారు. ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో కుటుంబ సంభాషణ గురించి చెబుతూ ఆయన వాడిన 'కుర్చీ మడతపెట్టి' అనే పదం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ పాప్యులారిటీతో మహేశ్ బాబు నటించిన 'గుంటూరు కారం' చిత్రంలోని టైటిల్ సాంగ్‌లో ఇదే పదాన్ని పాడే అవకాశం దక్కించుకున్నారు.

# నేల ఆరోగ్యాన్ని కాపాడదాం




**రుద్రవరం ప్రతినిధి మే 20 (నంది పత్రిక):** మండల వ్యవసాయ అధికారి జి సుమతి మరియు ఎంపీడీవో భాగ్యలక్ష్మి, డిప్యూటీ తాసిల్దారు చంద్రశేఖర్ మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగినది .ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు అధిక రసాయనికఎరువులు వాడటం వలన నేల ఆరోగ్యంతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని తెలిపారు .భూమిలోని పోషకాల లబ్బిత నానాటికి క్షీణించి భూమి నిస్సారం అవుతున్నందువలన రైతులందరూ యూరియా మరియు డిఏపి వాడకాలను మోతాదుకు మించి వాడ రాదని తెలిపారు .వీటికి ప్రత్యాన్యంగా పిఎండిఎస్ విత్తనాలు నవధాన్యాలు లేదా జీలుగా జనుము తొలకరిలో వేసి భూమిలో కలదున్ని భూసరాన్ని పెంపొందించుకోవాల్సిందిగా కోరడమైనది. అత్యవసరమైన పరిస్థితులలో నానో యూరియా నానో డి ఏ పి సేంద్రియ ఎరువులు మొక్క ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు .రైతులు తప్పనిసరిగా తమ పొలాలలో భూసార పరీక్షలు చేసుకొని వాటి ఫలితాలు అనుగుణంగా తగు మోతాదులో ఎరువులు వాడాలని రైతులకు తెలియజేశారు. అదేవిధంగా యంత్ర పరికరాల కోసము ప్రభుత్వము ఈనెల 26వ తేదీ వరకు గడువు పొడిగించిందని కావలసిన రైతులు రైతు సేవ కేంద్రాలు సిబ్బందిని సంప్రదించి తమ పేరు నమోదు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో "మహిళల సంరక్షణ మా బాధ్యత" అవగాహన సదస్సు...



ముఖ్య అతిథిగా హాజరైన నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి ఆప్ పై అవగాహన తప్పనిసరి...

ఆపద సమయంలో '112', సైబర్ నేరాలకు '1930' నెంబర్లను సంప్రదించాలి...

జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్



**నంద్యాల క్రైం, మే20(నంది పత్రిక):-** నేటి సమాజంలో మహిళల రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ పేర్కొన్నారు. నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని ఆర్జీయం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం "మహిళా సంరక్షణ మా బాధ్యత" అనే అంశంపై నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ ఎం. జావళి ఆల్ఫోన్స్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ లక్ష్యాన్ని ముందే నిర్దేశించుకోవాలని, జీవితంలో ఏదైనా సాధించాలంటే ఈ వయసులోనే బలమైన సంకల్పం ఉండాలి. అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదు. కష్టపడి విజయం సాధించినప్పుడే ఆ విజయానికి విలువ ఉంటుంది" అని స్ఫూర్తి నింపారు. విద్యార్థినులు మరియు మహిళలు జనసంచారం లేని ప్రాంతాలకు ఒంటరిగా వెళ్ళకపోవడం మంచిది కాదని సూచించారు. ఆపద సమయంలో మీకు తోడుగా ఉండేందుకు మీ సెల్ ఫోన్ లలో శక్తి యాప్ ను అందరూ డౌన్లోడ్ చేసుకొని నిక్షిప్తం చేసుకోవాలని,ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీస్ సహాయం కోసం 112 నెంబర్‌కు గాని కాల్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చునన్నారు. సదస్సులో భాగంగా చేసిన ఒక 'టెస్టింగ్ కాల్' ద్వారా కేవలం 15 నిమిషాల్లోనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తమ స్పందన వేగాన్ని నిరూపించారని ఎస్పీ తెలిపారు. తల్లిదండ్రులు మీపై ఉంచుకున్న ఆశయాలను వమ్ము చేయకుండా, ఉన్నత చదువులు చదివి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ ఎం. జావళి మాట్లాడుతూఆర్థిక స్వావలంబనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని మహిళలు దేనిలోనూ తక్కువ కాదని, ఉన్నత ఆశయాలతో చదివి తమ కాళ్ళపై తాము నిలబడాలన్నారు. ఎప్పుడైతే మహిళలు ఆర్థికంగా స్థిరపడతారో, అప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'శక్తి యాప్', 'శక్తి టీమ్స్' పనితీరును వివరిస్తూ, వీటిని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఫోక్సో చట్టం యొక్క ప్రాముఖ్యత గురించి క్షుణ్ణంగా వివరించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జయరాములు మాట్లాడుతూ.. నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు సరికొత్త ఎత్తుగడలతో మోసాలకు పాల్పడుతున్నారని, అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సొంత జాగ్రత్తలే బ్యాంక్ ఖాతాలను, వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుతాయని, విద్యార్థినులకు వివిధ సైబర్ స్కామ్‌లపై అవగాహన కల్పించారు. పాణ్యం ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా స్థానిక పాణ్యం పోలీస్ స్టేషన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. 112 కాల్ ద్వారా ఫిర్యాదు చేసి తక్షణ రక్షణ పొందవచ్చని, సైబర్ హెల్ప్ లైన్ నెంబర్లను కూడా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాణ్యం సబ్ ఇన్స్పెక్టర్ నరేంద్ర కుమార్ రెడ్డి, ఆర్జీయం కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# పెద్దకడుబూరు పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసి నేరాల నియంత్రణ కు చర్యలు తీసుకోవాలి

## పోలీసు స్టేషన్ రికార్డులను పరిశీలించిన కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐ పి యస్




**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** పెద్దకడుబూరు పోలీసు స్టేషన్ ను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్ కేసులను సమీక్షించారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, నేర నియంత్రణ కు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్ ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సైబర్ నేరాల పై, మహిళా చట్టాల పై మహిళలకు , నూతన చట్టాల పై ప్రజలకు అవగాహన చేయాలన్నారు. కర్నూలు ఎస్పీ తో పాటు కోసిగి సిఐ మంజునాథ్ , పెద్దకడుబూరు ఎస్సై మారుతి మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలి ఇవ్వండి రాష్ట్ర మంత్రికి వినతి పత్రం సమర్పించిన సిపిఐ నాయకులు



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** అమరావతిలోని సచివాలయంలో సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ కే రామకృష్ణ నాయకత్వంలో కర్నూల్ నగరంలో భూ పోరాటం స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని రెవిన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ని కలవడం జరిగినది కలిసిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కే రామాంజనేయులు మాజీ ఎమ్మెల్సీ జెల్విల్సన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనిజ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి సహాయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు పుల్లయ్య మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు ఈ సందర్భంగా మంత్రి సిపిఐ నాయకులతో మాట్లాడుతూ కలెక్టర్ తో ఎంక్వయిరీ చేయించి మీకు మరియు పేదలకి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది

# వెనుకబడిన వర్గాలను చట్టసభలలో అత్యున్నతమైన కూర్చోపెట్టింది సీఎం చంద్రబాబు నాయుడే

దళితులపై దౌర్జన్యాలకు పాల్పడే వైసిపి నీ దూరంగా ఉంచండి.

పేదలను ఆర్థిక వెసులుబాటుకు ఆదుకునే ప్రయత్నమే సీఎం సహాయనిది.

పట్టణంలో కేజీ రహదారిపై డివైడర్లను పది రోజుల్లోగా ప్రారంభిస్తాము.

ప్రజలకు అందించే మంచినీటి పథకాన్ని ఓర్వలేకే మంత్రి కే.కృష్ణమూర్తి ప్రారంభించిన శిలాఫలకాన్ని పగలగొట్టారు.

ఎమ్మెల్యే గిత్త జయసూర్య.



**నందికొట్కూరు మే 20( నంది పత్రిక)** దేశంలోనే అత్యున్నతమైన చట్టసభలలో ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందిన వ్యక్తులను అత్యున్నతమైన గౌరప్రమైన స్థానంలో నిలబెట్టింది సీఎం చంద్రబాబు నాయుడు మాత్రమేనని అందుకు నిదర్శనం రాష్ట్రపతి గా అబ్దుల్ కలాం, లోకసభ స్పీకర్ గా బాలయోగి, శాసనసభ స్పీకర్ గా మహిళను నియామకంలో టిడిపి పార్టీ ప్రభుత్వానికి తమ అధినేతకు దళితుల సంక్షేమ పట్ల ఉన్న చిత్తశుద్ధి అని ఎమ్మెల్యే గిత్త జయ సూర్య పేర్కొన్నారు. వైసీపీ పాలనలో దళితులపై జరిగిన దౌర్జన్యాలపై బుధవారం నందికొట్కూరు మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే గిత్త జయ సూర్య పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైసీపీ ప్రభుత్వంలో దళిత ప్రజలపై వైసిపి ప్రభుత్వం పాలకులు సాగించిన దౌర్జన్య ఘటనలను ఎమ్మెల్యే వివరిస్తూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత మాజీ సియం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దళితులను చంపి డోర్ డెలివరీ చేసిన ఘనత వైసిపి నాయకులకు చెందుతుందన్నారు. వైసిపి ఎమ్మెల్సీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం దళితుడని, అతని చంపి డోర్ డెలివరీ చేశారని, అదేవిధంగా వైద్యుడైన డాక్టర్ సుధాకర్ ను కోవిడ్ సమయంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపినందుకు అతని మానసిక రోగి గా ముద్రించి చిత్రహింసల గురిచేసి ఆయన మరణానికి ప్రభుత్వ పాలకులే కారణమని, అది రాష్ట్ర ప్రజలకు తెలిసినని పేర్కొన్నారు. ఇలాంటి దళితులపై దుర్మార్గమైన ఘటనకు పాల్పడిన వైసీపీ ప్రభుత్వానికి ఓటుతోనే బుద్ధి చెప్పి 151 సీట్ల కుగాను 11 సీట్లకే పరిమితం చేసి బుద్ధి చెప్పిన వైసీపీ నేతలకు ఇంకా బుద్ధి మారలేదని, ఇలాంటి వైసిపి పార్టీని దళిత సోదరీ సోదరీమణులు దూరంగా ఉంచాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య కోరారు. నాడు నేడు ఎల్లప్పుడూ దళితుల సంక్షేమం కోసం కృషి చేసిన ఘనత టిడిపి ప్రభుత్వం అది సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రోత్సాహంతో ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన వ్యక్తి అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా నియమించడంలో కీలకపాత్రా దళితుడైన బాలయోగిని లోకసభ స్పీకర్గా నియమించడంలో సీఎం చంద్రబాబు నాయుడుకు ఎస్సీ ఎస్టీ ముస్లిం మైనార్టీ ప్రజలపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని, అత్యున్నతమైన స్థానంలో గౌరవమైన హోదాలో కూర్చోబెట్టిన ఘనత తమ అధినేత నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఆయన కొనియాడారు. నియోజవర్గంలోని అభివృద్ధి పనుల్లో టిడిపి ప్రభుత్వ హయాంలో ముందుకెళ్లడం జరిగిందని, గత టిడిపి ప్రభుత్వంలో నందికొట్కూరు పట్టణ ప్రజలకు మంచినీటి సౌకర్యార్థం అలగనూరు రిజర్వాయర్ నుంచి నీటిని అందించాలన్న సదుద్దేశంతో శంకుస్థాపన చేసి ప్రారంభించడానికి శిలాఫలం ఏర్పాటు చేస్తే అది ఓర్వలేని వైసీపీ నాయకులు శిలాఫలం ను పగలగొట్టి ప్రజలకు ద్రోహం చేసింది వైసిపి పార్టీ అన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న కర్ణంలో సీఎం చంద్రబాబు నాయుడు కృషితో నియోజవర్గం మరియు పట్టణములో అభివృద్ధి కార్యక్రమాలలో ముందుకెళు తున్నామని, అదేవిధంగా మెరుగైన వైద్య సదుపాయాల కోసం అపన్న హస్తం అందించేందుకు పేద బడుగు బలహీన వర్గాలను ఆదుకునే ఆర్థిక భరోసాని సీఎం సహాయనిదని, అలాంటి సీఎం సహాయ నిధిని రాజకీయాలకు అతీతంగా అందజేస్తే విమర్శించడం తగదన్నారు. పట్టణ అభివృద్ధిలో కేజీ రహదారిపై డివైడర్లు, వీధిలైట్ల ఏర్పాట్లు త్వరలోనే చేపడతామని వెల్లడించారు. వైసిపి పాలనలో దళితులపై చేసిన దౌర్జన్య సంఘటనలను ప్రజలెవరు మరవకూడదని ఆ పార్టీని దూరంగా ఉంచాలని దళిత సోదరీ సోదరీమణులకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి,

టిడిపి నాయకులు పలుచాని మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, దేవ సహాయం, రఫీ , కళాకారు తదితరులు పాల్గొన్నారు.

# నందికొట్కూరులో ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు.



**నందికొట్కూరు మే 20( నంది పత్రిక)** తెలుగు ప్రజల గుండెల్లో నటన లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న టాలీవుడ్ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం నందికొట్కూరు పట్టణంలో శాంతి థియేటర్ వద్ద అభిమాన సంఘం నాయకులు ప్రెసిడెంట్ కాజా, వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్లా, లడ్డు ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరు ఒకరు కేక్ తినిపించుకుంటూ ఆనందోత్సాహాల నడుమ తమ అభిమాన నటుడు హీరో జూనియర్ ఎన్టీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాన సంఘ నాయకులు భాష, పైజూల్లా, సుభాన్, ఇలియాస్, మధు, హుస్సేన్ భాష, అశోక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కోసిగి పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసి నేరాల నియంత్రణ కు చర్యలు తీసుకోవాలి.

## పోలీసు స్టేషన్ రికార్డులను పరిశీలించిన కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కోసిగి పోలీసు స్టేషన్ ను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్ కేసులను సమీక్షించారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్ ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సైబర్ నేరాల పై, మహిళా చట్టాల పై మహిళలకు , నూతన చట్టాల పై ప్రజలకు అవగాహన చేయాలన్నారు. కర్నూలు ఎస్పీ తో పాటు కోసిగి సిఐ మంజునాథ్ , కోసిగి ఎస్సై రమేష్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పేద ప్రజల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి అండగా నిలుస్తోంది

## - టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి

**మంత్రాలయం , మే 20 :-** నిరుపేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిది ఒక భరోసాగా నిలుస్తుందని మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు సోమవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో కోసిగి టౌన్‌కు చెందిన గుండెకల్లు ఈరమ్మ కాన్సర్ చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి

(ఎల్ ఓ సి) కింద మంజూరైన రూ.4,లక్షల చెక్కును బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ అండగా నిలుస్తారని కొని ఆడారు అనంతరం బాధితులు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి, వారికి అండగా నిలుస్తూ ఈ సహాయం అందేలా చేసిన మాన్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, అలాగే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సహకరించిన మన మంత్రాలయం టీడీపీ ఇంచార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి కి ఈరమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# సోషల్ మీడియాను షేక్ చేస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ'!

సోషల్ మీడియాలో ఎప్పుడు ఏది ట్రెండ్ అవుతుందో చెప్పడం కష్టం. తాజాగా 'కాక్రోచ్ జనతా పార్టీ' అనే ఓ సెటైరికల్ వెబ్‌సైట్ ఇంటర్నెట్‌లో సంచలనంగా మారింది. కొద్ది రోజుల క్రితం ప్రారంభమైన ఈ వెబ్‌సైట్‌కు సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ పేజీకి కొన్ని రోజుల్లోనే 6.6 మిలియన్ల (66 లక్షల) మందికి పైగా ఫాలోవర్లు వచ్చి చేరారు.

# రూరల్ సిఐ సుబ్రహ్మణ్యం కు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ.



**నందికొట్కూరు మే 20( నంది పత్రిక )** నందికొట్కూరు రూరల్ సిఐ సుబ్రహ్మణ్యం జన్మదినం ను పురస్కరించుకొని నియోజవర్గంలోని ప్రజా సంఘాలు మరియు కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీ నాయకులు జర్నలిస్టు, మరియు ప్రజలు బుధవారం రూరల్ సర్కిల్ కార్యాలయం నందు సీఐ సుబ్రహ్మణ్యం కు పుష్పగుచ్ఛములు, శాలువలతో సన్మానిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజవర్గంలోని రూరల్ పరిధిలో గ్రామాల్లో శాంతిభద్రతలపై, మరియు ప్రజలకు అందుతున్న పోలీస్ సేవలపై ఆయన చూపుతున్న శ్రద్ధ పై అభినందనలు తెలుపుతూ ఆయన విధి నిర్వహణను కొనియాడారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో సిపిఐ పార్టీ నాయకులు రమేష్ బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రేమ్ రాజ్, లక్ష్మీ మెడికల్ నిర్వాహకులు కాటం నాగన్న, టిడిపి నాయకులు చారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తేనె నాగరాజు, బి ఎస్ పి పార్టీ నాయకులు లాజర్, మరియు వివిధ ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



## బేతంచెర్ల మండలంలో మెడికల్ షాపులు బంద్



**బేతంచెర్ల మే 20 (నందిపత్రిక )** నకిలీ మందలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చేపట్టిన మెడికల్ షాపులు బంద్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. బుధవారం బేతంచెర్ల పట్టణంలో ఉన్న మెడికల్ షాప్ లను యజమానులు స్వచ్ఛందంగా బంద్ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ షాపు అసోసియేషన్ అధ్యక్షుడు రాం పుల్లయ్య కార్యదర్శి దామోదర్ మాట్లాడారు. ఈ సందర్భంగా బేతంచర్ల మండలంలోని సుమారు 30 మేకల షాపులు ఉన్నాయని అఖిల భారత కెమిస్టుల సమాఖ్య ఆల్ ఇండియ మెడికల్ షాపుల బంద్ కు పిలుపునివ్వడంతో తాము అందుకు సహకరించడం జరిగిందని, ఆన్లైన్ వ్యాపారుల ద్వారా చిన్న చిన్న షాప్ యజమానులు త్రీవంగా నష్టపోతున్నారని, కొంతమంది అద్దెలు చెల్లించలేని స్థితిలో ఉన్నారని, అందువలన ప్రభుత్వం ఆన్లైన్ వ్యవస్థకు స్వస్తిపలికి, షాపుల్లోనే మందులను కొనుగోలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారితోపాటు పలు షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.

# శుభకార్యానికి హాజరైన మాజీ మంత్రి బుగ్గన.



**బేతంచెర్ల మే 20 (నందిపత్రిక )** బేతంచెర్ల పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన వైసిపి నాయకులు పాణ్యం టైలర్ ఆనంద్ & లక్ష్మీదేవి దంపతుల కుమారుడు పి గోవర్ధన్ & బి సింధు వీరి వివాహం గత వారం క్రితం జరిగినది. బుధవారంనాడు మాజీమంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి వారి ఇంటి దగ్గరికి వెళ్లి నూతన దంపతులను అక్షంతలు వేసి ఆశీర్వదించారు. మాజీ మంత్రి బుగ్గనతోపాటు,బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్. చలం రెడ్డి, మాజీ మద్దిలేటి స్వామి చైర్మన్ సిహెచ్. లక్ష్మిరెడ్డి,కొత్తపల్లి ఎంపీటీసీ మునీశ్వర రెడ్డి, కౌన్సిలర్ ఇబ్రహీం,జిల్లా ప్రధాన కార్యదర్శి పుసులూరు మురళీకృష్ణ, మండల కన్వీనర్ తిరుమలేశ్వర రెడ్డి, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, సంజీవ నగర్ వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మృతురాలికి నివాళి అర్పించిన నేతలు

**అవుకు మే 20నందిపత్రిక** అవుకు మండలం కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన నల్లబోలు నారాయణ రెడ్డి తల్లి నల్లబోలు నాగలక్ష్మమ్మ వయసు రీత్యా చనిపోయిన విషయాన్ని తెలుసుకొని అవుకు, బనగానపల్లె కు చెందిన పలువురు రాజకీయ నేతలు ఆమె మృత దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ,అవుకు మండల ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి ,సీనియర్ వైఎస్సార్సీపీ నాయకులు చల్లా సూర్యప్రకాష్ రెడ్డి ,అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి భాస్కర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,సూర్యనారాయణ రెడ్డి,గుర్రెడ్డి,కంబిరెడ్డి, శ్రీనివాస రెడ్డి,తదితరులు నివాళి అర్పించారు.



## మన గ్రామాల శుభ్రత మన చేతిలోనే... ఎంపీడీవో డి. గోపికృష్ణ



**జూపాడుబంగ్లా: మే :20: (నంది పత్రిక )** మన గ్రామాల పరిశుభ్రత మన చేతిలోనే ఉందని ఎంపీడీవో డి. గోపికృష్ణ అన్నారు. బుధవారం తాటిపాడు గ్రామంలో స్వేచ్ఛ పథకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డి. గోపికృష్ణ మాట్లాడుతూ స్వేచ్ఛ పథకం అనేది ప్రతి పౌరుడి విధి అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో తోడ్పడాలని పిలుపునిచ్చారు. నేడు మనము తీసుకునే చర్యలు భావి తరాల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తావని గుర్తించాలన్నారు. పరిశుభ్రతపై మనము చూపే శ్రద్ధ వారికి మంచి జీవన వాతావరణాన్ని అందించడంలో కీలకమవుతుందిన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా తడి చెత్త,పొడి చెత్త వేరు చేయుట ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. ప్రతి పౌరుడు తన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మాత్రమే స్వేచ్ఛ పథకం జూపాడుబంగ్లా మండలాన్ని లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిప్పన్నా, స్వర్ణ గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్తల (బూత్ ఇంచార్జ్) పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్న టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ



**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** బుధవారం రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మన్సూర్ అలి ఖాన్, 98వ బూత్ ఇంచార్జ్ రంగ, 191వ బూత్ ఇంచార్జ్ షేక్ అబ్బాస్, 234వ బూత్ ఇంచార్జ్ షకీలా భాను, 247వ బూత్ ఇంచార్జి సికిందర్, 258వ బూత్ ఇంచార్జ్ నాయుడు జన్మదిన వేడుకలు రాష్ట్ర పరిశ్రమలు & వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రివర్యులు గౌరవ టీ.జీ భరత్ కార్యాలయం మౌర్య ఇన్, కర్నూలులో ఘనంగా నిర్వహించబడినవి. కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ సమక్షంలో నాయకులు కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుడిసె ఆది కృష్ణమ్మ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న నాయకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు రానున్న రోజులలో మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కర్నూలు నగర పార్టీ అధ్యక్షులు కొరకంచి రవికుమార్, రామాంజనేయులు, శేషయాదవ్, తిమ్మప్ప మొదలగు వారు పాల్గొన్నారు.

# జగన్ ను కలిసిన వైసిపి నాయకులు



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు మే 20:** బండి ఆత్మకూరు మండలానికి చెందిన వైఎస్ఆర్ పార్టీ నాయకులు బుధవారం వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో నంద్యాల మాజీ పార్లమెంటు సభ్యుడు పోచ బ్రహ్మానందరెడ్డి తో కలిసి, వైఎస్ఆర్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లాలి స్వామి, బండి ఆత్మకూరు మండలం జి సి ఎస్ మాజీ కన్వీనర్ ముడిమేల పుల్లారెడ్డి జగన్మోహన్ రెడ్డిని కలిశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా లాలి స్వామిని వైఎస్ఆర్ పార్టీ అధిష్టానం బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా లాలి స్వామి తనకు కార్యదర్శి పదవి ఇచ్చినందుకు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గతంలో కంటే పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని జగన్మోహన్ రెడ్డి తెలిపారని లాలి స్వామి, పుల్లారెడ్డి పేర్కొన్నారు. పార్టీ కోసం అందరూ కష్టపడాలని రాబోవు రోజులలో వైసీపీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జగన్మోహన్ రెడ్డి తమతో పేర్కొన్నారని వైసీపీ నాయకులు తెలిపారు.

# బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి డీఎస్పీ ఏ శ్రీనివాసులు

**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 20 నంది పత్రిక** రాబోయే బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఆళ్లగడ్డ డిఎస్పి ఏ శ్రీనివాసరావు తెలిపారు బుధవారం సాయంత్రం ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్లో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని పిస్ కమిటీ సమావేశం నిర్వహించారు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముస్లిం మత పెద్దలు విశ్వహిందూ పరిషత్ బహిరంగదళ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈనెల 27న జరగనున్న పండుగను అందరూ సామరస్య పూర్వకంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డి.ఎస్.పి కోరారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ నాగరాజరావు ఎస్సై పీరయ్య తదితరులు పాల్గొన్నారు.



# రాయితీపై వ్యవసాయ పనిముట్ల కొరకు దరఖాస్తు చేసుకోండి.

## బేతంచెర్ల అగ్రికల్చర్ ఆఫీసర్ విజయ కుమార్ రెడ్డి.



**బేతంచెర్ల మే 20 (నందిపత్రిక )** బేతంచెర్ల మండలం వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా, మండల రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మే నెల 5 వ తేదీ నుండి 26 వ తేదీ వరకు రైతులు సీడ్ ఎపి .గవ..ఇన్ /ఎఫ్ఎం అను వెబ్ సైట్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ట్రాక్టర్లు ,మినీ ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, బేలర్లు, టైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ దుక్కు, దమ్ము సెట్లు, రోటవేటర్లు, పవర్ వీడర్లు ,పవర్ టిల్లేర్లు, తదితర వ్యవసాయ పనిముట్లు రాయితీతో రైతులకు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు. చిన్న, సన్న కారు రైతులు,మహిళా రైతులు,ఎస్సీ ,ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీతో మరియు ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీతో ఎస్ఎంఎఎం పథకం కింద వ్యవసాయ యాంత్రీకరణ అందించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ భూమి కలిగి లేదా ఆర్ఓఆర్ భూమి కలిగిన రైతులు మాత్రమే అర్హులు. 2024- 25 సంవత్సరానికి సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలను పొందిన రైతు కుటుంబాలు అనర్హులు. దరఖాస్తు చేసుకున్న రైతులకు లాటరి పద్దతి ద్వారా జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఎంపిక చేస్తారు.ఆసక్తి గల రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసులోవాలని బేతంచెర్ల మండల అగ్రికల్చర్ అధికారి కోరారు.మరింత సమాచారం కొరకు స్థానిక రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించవలసిందిగా మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

# 50% సబ్సిడీలో జీలుగా, పిల్లి పెసర విత్తనాలు పంపిణీ

## పచ్చిరొట్టె సాగుతో లాభాలు మెండు

## భూ సారం పెరిగి అధిక దిగుబడులు

## రసాయన ఎరువుల మోతాదు తగ్గుతుంది.. ఏవో



**అవుకు మే 20నందిపత్రిక** రైతులు పంటలు అధిక దిగుబడులు పొందడానికి పెట్టుబడుల ఖర్చులు తగ్గి, ఆశించిన దిగుబడులు సాధించాలంటే వరి సాగుకు ముందు జీలుగ విత్తనాలు సాగు చేసి భూమిలో కలియ దున్నితే భూసారం పెరగడంతో పాటు పంట దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి కలిమున్నిసా తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రైతుకు అధిక లాభాలను ఇచ్చే పచ్చి రొట్టె ఎరువు పంటలు జీలుగ, పిల్లి పెసర సాగు చేస్తే తగ్గించడంతోపాటు భూసారం పెరుగుతుందని తెలిపారు. పెట్టుబడి ఖర్చులు తగ్గి ఆశించిన దిగుబడులు సాధించాలంటే వరి సాగుకు ముందు జీలుగు విత్తనాలు సాగు చేసి తర్వాత భూమిలో కలియ దున్నితే భూసారం పెరగడంతో పాటు పంట దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని సూచించారు. రైతులు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుతూ పచ్చి రొట్టె ఎరువుల పంటలు అయిన జీలుగ,పిల్లి పెసర సాగును విస్మరిస్తున్నారని అన్నారు . జీవ రసాయనిక చర్య వలన నేల సారం పెరుగుతుందని, నేల లో లభ్యం కాని రూపంలో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపంలోకి మారతాయి అన్నారు. జీలుగా, పిల్లి పెసర వంటి పచ్చి రొట్టె ఎరువులు వేసినప్పుడు వీటి వేర్లు ఎక్కువ లోతుకు వెళ్లడం వల్ల భూమి లోపల పొరల్లో నిక్షిప్తమైన అనేక పోషకాలు పంటకు లభిస్తాయని తెలియజేశారు. పచ్చి రొట్టె పైర్లు ఎరువులు గానే కాకుండా పశువులకు మేతగ కూడా ఉపయోగపడుతుందని తెలియజేసారు.

**50 శాతం సబ్సిడీ తో జీలుగా,పిల్లి పెసర విత్తనాల పంపిణీ**

అవుకు మండలం నకు 300 క్వింటాల్ ల జీలుగ,30 క్వింటాల్ ల పిల్లి పెసర విత్తనాల అందుబాటు లో ఉన్నాయని తెలియజేశారు. 10 కేజీ ల బ్యాగ్ ధర 1600 రూపాయలు.సబ్సిడీ పోను రైతు చెల్లించవలసిన వాటా 800 రూపాయలు. అలాగే పిల్లి పెసర 8 కేజీల బ్యాగ్ ధర 1568 రూపాయలు సబ్సిడీ పోను రైతు చెల్లించవలసింది 784 రూపాయలు. ఇందుకోసం సంబంధిత రైతు సేవా కేంద్రం లోని గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవ సహాయకులని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అని తెలియజేశారు.

# డోన్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి

## అధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో కీలక ఆదేశాలు

## పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

## సమన్వయంతో ప్రజా సమస్యలను పరిష్కరించాలి

**నందిపత్రిక- డోన్** డోన్ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలనిడోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ఆదేశించారు. బుధవారం డోన్ పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ఒక కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డోన్, బేతంచర్ల, ప్యాపిలి మండలాలకు సంబంధించిన ఆర్డీవో ఎమ్మార్వో ఎంపీడివో లతో పాటు నేషనల్ హైవే అథారిటీస్, ఇరిగేషన్, ఫారెస్ట్, రెవిన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు, ఇంజినీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులు, పెండింగ్ ప్రాజెక్టులు, ప్రజా సమస్యలు భవిష్యత్ కార్యాచరణపై ఎమ్మెల్యే అధికారులతో శాఖల వారీగా సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా రైతులు, గ్రామీణ పట్టణ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. శాఖల వారీగా పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేదిలేదన్నారు .అన్నిశాఖలఅధికారులు ఒకరికొకరు సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశం అనంతరం ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రస్తుత సమస్యలను సమగ్రంగా అర్థం చేసుకున్నామని, వాటి పరిష్కారానికి ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహులు డిఎస్పి శ్రీనివాసులు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.



# బక్రీద్ పండుగ నేపథ్యంలో స్లాటర్ హౌస్ యజమానులతో నంద్యాల వన్ టౌన్ పోలీసుల సమావేశం...





## నిబంధనలు ఉల్లంఘించరాదని ఆదేశాలు...

**నంద్యాల క్రైం, మే20(నంది పత్రిక):-** రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం జావళి సూచనలతో నంద్యాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్లాటర్ హౌస్ (కసాయి ఖానా) యజమానులు మరియు కార్మికులతో పోలీసులు ఒక ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. పండుగను శాంతియుత వాతావరణంలో, చట్ట నిబంధనలకు లోబడి జరుపుకునేలా చూడటమే ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశంమని తెలియజేశారు. ఈ సందర్భంగా స్లాటర్ హౌస్ నిర్వాహకులకు మరియు ప్రజలకు పోలీసులు క్రింది ముఖ్యమైన సూచనలను జారీ చేశారు

**ముఖ్యమైన సూచనలు నిబంధనలు:** ప్రభుత్వ నిబంధనలు మరియు ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి. నిషేధిత జంతువుల వధపై నిషేధం.చట్టప్రకారం నిషేధించబడిన జంతువుల రవాణా, నిల్వ మరియు వధను పూర్తిగా నిషేధించడం జరిగింది. ఈ నిబంధనను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయి. ప్రభుత్వ అనుమతి లేని ఏ ఇతర బహిరంగ లేదా ప్రైవేట్ ప్రదేశాలలో జంతువుల వధను నిర్వహించరాదు.

జంతువుల రవాణా మరియు వధకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన అవసరమైన అన్ని అనుమతులు, పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలి. ప్రజా శాంతి భద్రతలకు మరియు మత సామరస్యానికి భంగం కలిగించే ఎలాంటి చర్యలకైనా పాల్పడకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోరాదు. చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయి. సమాజంలో ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా, లేదా పైన పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం అందినా...

వెంటనే ఆ విషయాన్ని పోలీసులకు చేరవేయాల్సిందిగా కోరడమైనది. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ, పోలీసు శాఖకు సహకరిస్తూ బక్రీద్ పండుగను అత్యంత శాంతియుత

వాతావరణంలో, సంతోషంగా జరుపుకోవాలని నంద్యాల వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# మహిళల భద్రత మనందరి బాధ్యత :






## కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** ఎమ్మిగనూరు వెంకటాపురం కాలనీలో "మీ రక్షణ - మా బాధ్యత" అవగాహన కార్యక్రమం మహిళల రక్షణ కోసం "శక్తి యాప్" వినియోగించుకోవాలి.చట్టాలపై అవగాహన పెరిగితేనే నేరాలు తగ్గుతాయి.మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ, మహిళల రక్షణ మరియు సైబర్ నేరాల పై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఎమ్మిగనూరు పట్టణంలోని వెంకటాపురం కాలనీలో శ్రీ గుంటెప్ప స్వామి దేవాలయం దగ్గర బుధవారం "మీ రక్షణ - మా బాధ్యత" పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు.ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మాట్లాడుతూ ...మహిళల రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారన్నారు. మహిళలు ఎటువంటి వేధింపులు, సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెరిగితేనే నేరాలు తగ్గుతాయని పేర్కొన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, నిర్భయ చట్టం వంటి పలు చట్టాలు మహిళల రక్షణ కోసం అమల్లో ఉన్నాయని తెలిపారు. పని ప్రదేశాల్లో లేదా సమాజంలో మహిళలపై అఘాయిత్యాలు జరిగినప్పుడు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న "శక్తి యాప్" వంటి ఆధునిక సాంకేతిక సదుపాయాలను మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112, 100, 181, 1098, 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి.వి. జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల భద్రత కు , మహిళల చట్టాల ప్రత్యేక శ్రద్ధ వహించిందన్నారు. సైబర్ నేరాల పై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలుంటే పోలీసులకు చేరవేయాలన్నారు. బాల్య వివాహాలుచేయకూడదన్నారు. ఎమ్మిగనూరు డీఎస్పీ శ్రీమతి భార్గవి మాట్లాడుతూమహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు లేదా మహిళలపై వేధింపులు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ కె. గంగి రెడ్డి , తహసీల్దార్ శ్రీనివాసులు , ఎమ్మిగనూరు రూరల్ సీఐ చిరంజీవి,

బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ నరసింహులు , టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ మహేష్ ,ఎస్సైలు, గ్రామ మరియు వార్డు సచివాలయ మహిళా పోలీసులు, పొదుపు సంఘాల మహిళలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## శ్రీశైలం దేవస్థానంలో వైభవంగా స్వర్ణరథోత్సవం

**శ్రీశైలం మే 20(నంది పత్రిక)** ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని (20.05.2026) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది.కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.

**అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది.** ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. అదేవిధంగా రథోత్సవంలో సంప్రదాయ నృత్యం, ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు దంపతులు, సహాయ కార్యనిర్వహణాధికారి యం. హరిదాసు, అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.





## వైసిపి నాయకుడు జక్కంపూడి రాజా పై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టిన తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రవి

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూల్ నగరంలో మే 14 వ తారీఖున వైసీపీ పార్టీ చేస్తున్న ఒక నిరసన కార్యక్రమంలో భాగంగా జక్కం పూడి రాజా మాట్లాడుతూ ఒక దళిత సీఐ శేషయ్య ని వాళ్ళ పార్టీ అధికారంలోకి వచ్చాక ఒక అల్లరి చిల్లర రౌడీ షీటర్ గాడి ఇంటి ముందు నిలబెట్టి పోస్టింగ్ కోసం అడుకునే దీన మైన స్థితికి ఆ సీఐ ని లాగుతం అని ఓపెన్ స్టేట్మెంట్ ఇచ్చాడు.. ఇక్కడే వీళ్ళు , వీళ్ళ పార్టీ క్రిమినల్ సిద్ధాంతాలు ఏంటో అనేది కళ్ళకు కట్టినట్లు తెలిసింది , అది కూడా ఎంత ధైర్యం ఉంటే ఒక పోలీస్ అధికారి పైన చూపించడం ఎంత విడ్డూరం, ఎంత కండ కావరం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇలానే ఒక దళిత డాక్టర్ సుధాకర్ ను అన్యాయంగా ఇబ్బందులకు గురి చేసి చంపేశారు , ఇప్పుడు అధికారం లేకుండానే ముందే మేము ఇది చేస్తాం అని బహిరంగంగా సందేశం ఇస్తున్నారు ,అది కూడా ఒక పోలీసు అధికారి పైన ఇలాంటి కుక్కల పైన న్యాయ పరంగానే చర్యలు నమోదు చెయ్యాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి జూటూరు రవి , దళిత నాయకులతో కలిసి ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చెయ్యడం జరిగింది .ఇలాంటి వైసీపీ రౌడీ రాజకీయ నాయకుల పైన తక్షణమే ఎస్సీ , ఎస్ టి అట్రాసిటీ కేసు నమోదు చేసి మరొక్కసారి దళితులను ఏమైనా చెయ్యాలనే ఆలోచననే చంపెయ్యాలి నేడు ఏకంగా ఒక పోలీస్ అధికారినే బహిరంగంగా భయపెడుతున్నారు, ఇక సాధారణ దళితులను ఏమైనా చెయ్యాలి అంటే వీళ్లకు ఎంత ధైర్యం ఉంది అని ఇటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జూటూరు రవి కోరారు.



## వైసిపి యువ నాయకుడు కూతురికి నామకరణం చేసిన మాజీ మంత్రి బుగ్గన.



**బేతంచర్ల మే 20 (నందిపత్రిక )** బేతంచెర్ల పట్టణానికి చెందిన వైసిపి యువ నాయకులు సూర్య బళ్లాని & సింధు దంపతుల కుమార్తె నామకరణ మహోత్సవానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాజరై చిన్నారిని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. మాజీ మంత్రి బుగ్గన తోపాటు రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, కొత్తపల్లి ఎంపీటీసీ మునీశ్వర రెడ్డి, మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్,జిల్లా ప్రధాన కార్యదర్శి పుసులూరు మురళీకృష్ణ, బుగానపల్లె మధు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కోవెలకుంట్ల ఆర్టిసి డిపో సమస్యలపై ఈడీ కి ప్రజా సంఘాల వినతి



**కోవెలకుంట్ల మే 20నందిపత్రిక** కోవెలకుంట్ల ఏపీ ఎస్ ఆర్టీసీ డిపో లో పేరుకుపోయిన సమస్యల పై కోవెలకుంట్ల ప్రజాసంఘాల నేతలు బుధవారం ఆర్టీసీ రాయలసీమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాఘవ కుమార్ కి వినతి పత్రం ఇచ్చారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ డిపోకు రాయలసీమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాఘవ కుమార్ కు వారు సమస్యలను విన్నవించారు.ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు కరీం భాషా ,ఎం సుధాకర్ ,వడ్డే సుబ్బరాయుడు, బందెల ఓబులేసు, బాలు యాదవ్, దండు రామసుబ్బయ్య, రాజు తదితరులు సమస్యలను వివరిస్తూ కోవెలకుంట్ల డిపో నందు వర్షాకాలంలో వరద నీటిని బయటికి వెళ్లే విధంగా శాశ్వత పరిష్కారం చేయాలి.బస్టాండ్ పరిధిలో పడమటి దిక్కున ఉన్నటువంటి ఖాళీ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాల్స్, షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మించాలి. బస్టాండ్ పరిధిలో సీసీ కెమెరాలు, వీధిలైట్లు, మరుగుదొడ్లు, త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలి. శ్రీ శక్తి పథకం ద్వారా మహిళలు ఫ్రీ బస్సుల్లో మహిళలకు ఆర్టీసీ డ్రైవర్ మరియు కండక్టర్లకు సమన్వయం ఉండేలా వారికి సూచనలు ఇవ్వాలి. స్థానికంగా ఐటిఐ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్యారేజ్ లో అప్రెంటిషిప్ అవకాశం కల్పించాలి. కోవెలకుంట్ల డిపో నుండి వెళ్లే నంద్యాల ,ఆళ్లగడ్డ, తాడిపత్రి, జమ్మలమడుగు మరియు కర్నూల్ రూట్లలో బస్సు సర్వీసులు పెంచాలి. పచ్చతనం ,పరిశుభ్రత లో భాగంగా ఆర్టిసి డిపో పరిధిలో చెట్లు నాటి పార్కు ఏర్పాటు చేయాలి. గతంలో ఉన్నటువంటి విజయవాడ, బెంగుళూరు, అనంతపురం బస్సులను పునరుద్ధరించాలని వినతి లో పేరుకోన్నట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు నాగేంద్ర, రవి , నరేష్ ,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ఆర్ సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి పై అక్రమ కేసు పెట్టడంపై ఫైర్ అయిన కర్నూల్ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి




**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూల్ నగరంలో జులై 14 వ తారీకు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడిన మాటలకు మంత్రి టీజీ భరత్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డిపై ఫిర్యాదు చేసిన గంట లోపే అతని పై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించి సూపర్ పోలీస్ అనిపించుకున్నారు. ఒక దళిత యువకుడు తన ఆత్మహత్య కు ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ కారణం అంటూ సూసైడ్ నోట్ వ్రాసి చనిపోతే అతని పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు యువకుడు తల్లిదండ్రులు కంప్లైంట్ ఇస్తే ఇంతవరకు ఎఫ్ఐఆర్ నమోదు చెయ్యలేదు. మంత్రికి సామాన్య ప్రజలకు ఇంతా తేడా ఉందనేది ప్రజల్లో అభిప్రాయం ఏర్పడుతుంది బైరెడి సిద్ధార్థ్ రెడ్డి మీద, ఎస్వీ మోహన్ రెడ్డిల మీద కేసులు పెడితే భయపడుతారనేది అవివేకం. కేసులు పెట్టినా, జైళ్లకు పంపించినా సామాన్య ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటామని చెప్పారు.

## ఘనంగా శివ కార్తికేయ జన్మదిన వేడుకలు

### బంధువులు ఆత్మయులు మధ్య భారీగా కేక్ కట్ చేసి సంబరాలు







**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆదోని పట్టణంలో బీరప్ప నగర్ లో శివ కార్తికేయ మొదటి పుట్టినరోజు ఘనంగా బంధువులు మధ్య జరుపుకున్నారు బీరప్ప నగర్ లో నివాసముతున్న రమేష్, సుమ మొదటి కుమారుడు శివ కార్తికేయ పుట్టినరోజు అంగరంగ వైభవంగా జరిగింది ఇలాంటి పుట్టినరోజులు శివ కార్తికేయ ఎన్నో జరుపుకోవాలని ఆరోగ్యంగా ఉండాలని వచ్చిన బంధువులు అక్షింతలతో దీవించారు మొదటి పుట్టినరోజు సందర్భంగా శివ కార్తికేయ హ్యాపీ బర్డే టూ యు అంటూ నినాదాలు రేకించారు అనంతరం వచ్చిన బంధువులకు స్నేహితులకు విందు ఏర్పాటు చేశారు

# సున్నిపెంట భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు





## రూ.10 కోట్లతో సున్నిపెంటలో రోడ్లు, తాగునీటి అభివృద్ధి పనులు వేగవంతం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల జిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంట మే 20 (నంది పత్రిక)** శ్రీశైలం డ్యామ్ పరిసర ప్రాంతాల అభివృద్ధి, భూముల వినియోగం, ప్రభుత్వ ప్రణాళికలు మరియు ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వెల్లడించారు. మంగళవారం సున్నిపెంటలో రూ.10 కోట్ల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఆస్తులన్నీ ప్రజలకే చెందుతాయని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రోడ్లు, పాఠశాలలు, డ్రైనేజీలు, ఆసుపత్రులు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సున్నిపెంట ప్రాంతంలో మరిన్ని డ్రైనేజీలు, అంతర్గత రహదారుల అవసరం ఉన్నట్లు గుర్తించామని, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే అంచనాలు సిద్ధం చేసి, త్వరలోనే పరిపాలనా మంజూరులు పొందేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'జలహారతి' కార్యక్రమం సందర్భంగా శ్రీశైలం డ్యామ్ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు, స్థానిక ఎమ్మెల్యే ప్రాంత అభివృద్ధి అవసరాలు, రహదారుల పరిస్థితిని వివరించారని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. శ్రీశైలం డ్యామ్ నిర్మాణ చరిత్రను ప్రస్తావిస్తూ, 1963 జూలై 19న డ్యామ్‌కు పునాది పడిందని గుర్తు చేశారు. అప్పట్లో ఈ ప్రాంతం మొత్తం అటవీ శాఖ పరిధిలో ఉండేదని, రిజర్వ్ ఫారెస్ట్ మరియు వైల్డ్‌లైఫ్ శాంక్చురీ నిబంధనలు అమలులో ఉన్నాయని తెలిపారు. అనంతరం డ్యామ్ నిర్మాణ అవసరాల కోసం అటవీ భూమిని డీ-రిజర్వ్ చేసి, 1964 నుంచి 1968 మధ్యకాలంలో సుమారు 1468 ఎకరాలను శ్రీశైలం డ్యామ్ నిర్మాణానికి కేటాయించారని, ప్రస్తుతం ఆ భూములు నీటి పారుదల శాఖ పరిధిలో ఉన్నాయని వివరించారు. ఇటీవల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించిన భూసర్వేలో కొండవాలు ప్రాంతాల్లో భూమి జారిపోవడంతో ప్రస్తుతం 1427 ఎకరాల 24 సెంట్ల భూమి అందుబాటులో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. సర్వే ప్రకారం ఈ ప్రాంతంలో ఇళ్లు, వాణిజ్య సముదాయాలు కలిపి మొత్తం 5,824 నిర్మాణాలు ఉండగా, 22 వేలకుపైగా జనాభా నివసిస్తున్నట్లు వెల్లడించారు. డ్యామ్ నిర్మాణం మరియు కాలువల నిర్మాణానికి సుమారు 450 ఎకరాల భూమిని వినియోగించారని తెలిపారు. మిగిలిన భూమిలో ఇరిగేషన్ శాఖ ఉద్యోగుల కోసం వివిధ కేడర్లకు చెందిన సిబ్బందికి సుమారు 2,360 క్వార్టర్స్ నిర్మించారని కలెక్టర్ చెప్పారు. అదనంగా పాఠశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు, ఆసుపత్రి, పోస్టాఫీస్, బ్యాంకులు తదితర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు భూములను కేటాయించారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ప్రజలు కూడా ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. సున్నిపెంట ప్రాంత భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలను సేకరించే ప్రక్రియను ప్రజల సౌలభ్యం దృష్ట్యా పొడిగించామని, ఇంకా సమస్యలపై దరఖాస్తులు ఇవ్వని వారికి గురు, శుక్ర, శనివారాల వరకు అదనపు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిపత్రం, రిటన్ స్టేట్మెంట్‌ను సమగ్రంగా పరిశీలించి క్రోడీకరించి ప్రభుత్వం మరియు గౌరవ న్యాయస్థానానికి పూర్తి స్థాయి నివేదిక సమర్పించనున్నట్లు కలెక్టర్ వివరించారు. గతంలో జారీ చేసిన జీవోలు, రెగ్యులరైజేషన్ విధానాలు, ప్రభుత్వ ఉత్తర్వులను సమగ్రంగా అధ్యయనం చేసి, సున్నిపెంట వాస్తవ్యులకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు ఉద్యోగులు లేదా రిటైర్డ్ ఉద్యోగులు అనే తేడా లేకుండా, ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు 125 ఎకరాల భూమి, సుమారు 2,300 ఇళ్లను సర్వే పరిధిలోకి తీసుకున్నామని, మిగిలిన ప్రాంతాలపై కూడా పూర్తి స్థాయి హోలిస్టిక్ అధ్యయనం చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు రిటన్ స్టేట్మెంట్ సమర్పించినందుకే వెంటనే ఖాళీ చేయించే పరిస్థితి ఉండదని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ముఖ్యంగా ఈ ఏడాది రోడ్ల నిర్మాణానికి కేటాయించిన రూ.25 కోట్లలో దాదాపు రూ.10 కోట్లు సున్నిపెంట ప్రాంతానికే మంజూరు కావడం ప్రజల పట్ల ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ, సున్నిపెంట గ్రామ ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని,

ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు అందజేస్తున్న నోటీసులను స్వీకరించి, ప్రభుత్వం గతంలో జారీ చేసిన ఇంటి పట్టాలు, సంబంధిత పత్రాలను సమాధానంగా సమర్పించాలని ప్రజలకు సూచించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సున్నిపెంట ప్రజలకు అన్యాయం జరగనివ్వబోమని, గ్రామ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే రోడ్లు, త్రాగునీటి సదుపాయాల కోసం రూ.10 కోట్లు మంజూరు చేశామని, త్వరలోనే ఇంటింటికీ కుళాయి ద్వారా ప్రతిరోజూ తాగునీరు అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామంలోని ఎక్కువ భాగం వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయ్యిందని, మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. అర్హులైన వారికి పక్కా గృహాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ వెంకట శివ, పంచాయతీరాజ్ ఈఈ నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.





# శ్రీశైలం దేవస్థానంలోభక్తుల సదుపాయాల కల్పనపై సమీక్ష



**శ్రీశైలం మే 20 (నంది పత్రిక)** దేవస్థానంలోని అన్నీ విభాగాలు కూడా భక్తుల సౌకర్యాల కల్పననే ప్రధానలక్ష్యంగా పనిచేస్తుండాలని కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు అన్నారు. ( 20.05.2026) సాయంకాలం పరిపాలనా భవనంలోని సమావేశమందిరంలో కార్యనిర్వహణాధికారి భక్తుల సదుపాయల కల్పనపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అన్నీశాఖల అధిపతులు, అన్నీ విభాగాల పర్యవేక్షకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ అన్నీ విభాగాలవారు కూడా పరస్పర సమన్వయంతో విధులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు సౌకర్యాలను మెరుగు పరుస్తుండాలన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ దర్శనం ఏర్పాట్లు,మంచినీటి సదుపాయం, అన్నప్రసాదవితరణ, ఉచిత ప్రసాదవితరణ, శౌచాలయాల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణలాంటి మౌలిక వసతులపై భక్తుల నుంచి 90శాతం సానుకూల స్పందన ఉండాలన్నారు. అందుకనుగుణంగా ప్రతీ ఉద్యోగి కూడా తమ విధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ముఖ్యంగా ఎట్టి పరిస్థితులలో కూడా విధులలో అలసత్వం ఉండకూడదన్నారు. విధుల నిర్వహణలో జవాబుదారీతనం ఉండాలన్నారు.

పెరుగుతున్న ఎండతీవ్రత కారణంగా భక్తులకు మంచినీటిని కల్పించేందుకు క్షేత్రపరిధిలోని ప్రధాన కూడళ్ళలో ఇప్పటికే ఉచిత చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ చలివేంద్రాలలో మంచినీటితో పాటు మజ్జిగ కూడా అందజేయడం జరుగుతుందన్నారు. వేసవికాలం ముగిసేంతవరకు కూడా ఈ చలివేంద్రాలను కొనసాగిస్తుండాలన్నారు. క్యూలైన్లలోనూ, క్యూకాంప్లెక్సులలోనూ, ఆలయప్రాంగణంలోనూ నిరంతరం మంచినీటి సరఫరా ఉండాలన్నారు. ఆలయప్రాంగణంలో ఇప్పటికే మట్టికుండలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆలయప్రాంగణంలో మరిన్ని కుండలను వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా క్యూకాంప్లెక్సు నందు నిరంతరం భక్తులకు అల్పాహారాన్ని అందజేస్తుండాలన్నారు. అన్నప్రసాదవితరణ భవనంలో శుచీశుభ్రతనిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు.

అన్నప్రసాదవితరణలోని రోజువారి వంటకాలలో తాజా కూరగాయలను మాత్రమే వాడాలన్నారు. కూరగాయలను కూడా తగువిధంగా తరగడం ఎంతైనా అవసరమన్నారు. సంబంధిత అధికారులు కూరగాయలు తరగడాన్ని కూడా జాగ్రత్తగా పరిశీలిస్తుండాలన్నారు. ముఖ్యంగా అన్నప్రసాదాలు రుచికరంగా ఉండేవిధంగా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తుండాలన్నారు. భక్తులు అధికసమయం వేచివుండకుండా త్వరితగతిన అన్నప్రసాదాలను అందజేస్తుండాలన్నారు. అలాగే వడ్డన సమయంలో ఆత్మీయంగా వంటకాలను వడ్డిస్తుండాలన్నారు. ప్రతీహాలులో కూడా వడ్డన సజావుగా జరిగేటట్లు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. ప్రతీ హాలును కూడా సిబ్బంది ప్రత్యేకంగా నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. సంబంధిత పర్యవేక్షణ చేసే సిబ్బంది క్షేత్రపరిధిలోని ప్రతీ వీధిలో కూడా నిరంతరం పారిశుద్ధ్య పర్యవేక్షణను చేస్తుండాలన్నారు. చెత్తా చెదారాలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలన్నారు. దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను ఆలయప్రసారవ్యవస్థ ద్వారా తగు సమయాలలో ప్రసారం చేస్తుండాలన్నారు. దీనివలన భక్తులు ఆయా సదుపాయాలను వినియోగించుకునే వీలు కలుగుతుందన్నారు.



## పెద్దమ్మతల్లి ని దర్శించుకున్న టిడిపి సీనియర్ నాయకులు భార్గవ్ రామ్



**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 20 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లి గ్రామంలో టిడిపి నాయకుల ఆహ్వానం మేరకు పెద్దమ్మ తల్లి దేవర కార్యక్రమంలో ఆళ్లగడ్డ టిడిపి సీనియర్ నాయకులు భార్గవ్ రామ్ పాల్గొన్నారు. బుధవారం నాడు గ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామ ప్రజలు టిడిపి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలోని టిడిపి నాయకులతో కలిసి పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం టిడిపి నాయకులతో సమావేశమై గ్రామాభివృద్ధి తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు, భూమా అభిమానులు పాల్గొన్నారు.



## గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం గడపగలరు

### ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.



**భీమవరం బ్యూరో చీఫ్ మే 20నంది పత్రిక** భీమవరం మండల పరిధిలోని గొల్లవాని తిప్ప గ్రామ శివారులో బుధవారం నిర్వహించిన "స్వచ్ఛ పదం" కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ స్వయంగా పాల్గొని పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామ పరిసరాల్లో శుభ్రత పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి గ్రామాలు, పట్టణాలను స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. గ్రామ శివారు ప్రాంతాలలో చెత్తకుప్పలు పేరుకుపోవడం వల్ల దోమలు, ఈగలు వ్యాప్తి చెందడంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అందువల్ల రోడ్ల పక్కన, కాలువల వద్ద చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఇష్టానుసారంగా చెత్త పారబోయే వారిని గుర్తించి వారికి అపరాధ రుసుములు విధించాలని సూచించారు. గ్రామాల్లో సంతలు నిర్వహించే రోజుల్లో భారీగా వ్యర్థ పదార్థాలు పేరుకుపోతాయని, వాటిని గ్రామపంచాయతీ గుర్తించిన ప్రదేశాల్లోనే డంపింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడం ద్వారా వ్యర్థాల నిర్వహణ సులభమవుతుందని చెప్పారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాలపై గ్రామస్థులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామపంచాయతీలు స్వయం సమృద్ధి సాధించే దిశగా ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలని అన్నారు. ఇప్పటివరకు ఇంటి పన్ను విధించని ఇళ్లను గుర్తించి పన్నులు వసూలు చేయాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాలలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారి నుండి వాణిజ్య పన్నులు కూడా క్రమబద్ధంగా వసూలు చేయాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది గ్రామాల పరిశుభ్రతకు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొంటూ వారికి సకాలంలో జీతాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రజారోగ్య పరిరక్షణకు పరిశుభ్రత ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, వీధి, గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీపీఓ వై.దోసిరెడ్డి, ఎంపీడీవో మురళీ గంగాధర్, డిప్యూటీ ఎంపీడీవో పి.రామాంజనేయ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బి.శ్రావణ్య, పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నేడు(మే 21) జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత రాక

### రెండ్రోజుల పాటు జిల్లాలో పర్యటన



**వై ఎస్ ఆర్ కడపబ్యూరో చీఫ్ , మే 20 నంది పత్రిక** : రెండ్రోజుల పర్యటన నిమిత్తం జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత గురువారం జిల్లాకు రానున్నారు. మొదటిరోజు టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో జరిగే పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశంలో పాల్గొనబోతున్నారు. రెండోరోజు జమ్మలమడుగు నియోజకవర్గంలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూడా జిల్లా ఇన్చార్జి మంత్రి పాల్గొనున్నట్లు మంత్రి కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. గురువారం ఉదయం విజయవాడ నుంచి విమానంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత కడప ఎయిర్ పోర్టుకు మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ కు చేరుకుని సేద తీరుతారు. సాయంత్రం 5.30 గంటలకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకుని, రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ కు ఇతర టీడీపీ నాయకులతో కలిసి ఘన స్వాగతం పలుకనున్నారు. అక్కడి నుంచి మంత్రి నారా లోకేశ్ తో కలిసి నగరంలోని రాజరాజేశ్వరి కల్యాణ మండపం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో జిల్లాకు చెందిన టీడీపీ శ్రేణులతో నిర్వహించే సమావేశంతో ప్రజా దర్బార్ కార్యక్రమంలో కానున్నారు. రాత్రికి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ చేరుకుని రాత్రి బస చేస్తారు. మరుసటి రోజు శుక్రవారం జమ్మలమడుగు నియోజక వర్గంలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్ తో కలిసి మంత్రి సవిత పాల్గొననున్నారు. అదే రోజు సాయంత్రం రోడ్డు మార్గాన శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండకు మంత్రి సవిత వెళ్లనున్నట్లు ఆ ప్రకటనలో మంత్రి కార్యాలయం తెలిపింది.

# రాష్ట్రంలో ఎరువుల అక్రమాలపై ఉక్కుపాదం

- వ్యవసాయేతర వినియోగం, బ్లాక్ మార్కెట్, అక్రమ రవాణాపై ప్రభుత్వం సీరియస్
- రైతులకు అందాల్సిన ఎరువులను పక్కదారి పట్టిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం
- వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంపైనా విచారణ
- ప్రత్యేక తనిఖీలు, విజిలెన్స్ నిఘా పెంపుకు ఆదేశాలు
- జిల్లాల వారీగా ఎరువుల స్టాక్‌లపై రోజువారీ మానిటరింగ్
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతిబ్యూరో చీఫ్ , మే 20 నంది పత్రిక** రాష్ట్రంలో రైతులకు అందాల్సిన ఎరువులను అక్రమంగా పక్కదారి పట్టించడం, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించడం, బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, ఇతర ప్రాంతాలకు తరలింపు వంటి వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులకు సరైన సమయంలో నాణ్యమైన ఎరువులు అందకుండా కొరత సృష్టించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని మంత్రి ఘాటుగా హెచ్చరించారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, ఇతర రాష్ట్రాలకు తరలించడం, పరిశ్రమలకు మళ్లించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే డీలర్లు, మధ్యవర్తులు, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల డీలర్లు, గోదాములు, రవాణా కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వ్యవసాయ శాఖ కమిషనర్ మంజీర్ జిలానీకి మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్, అనధికార విక్రయాలు, పరిశ్రమలకు, ఇతర అవసరాలకు ఎరువుల మళ్లింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. 2026-27 సంవత్సరంలో మే 4వ తేదీ నుండి ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అమలు విభాగం చేపట్టిన కఠిన చర్యలను మంత్రి వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎరువుల డీలర్లకు 182 షోకాజ్ నోటీసులు జారీ చేశారు, 80 ఎరువుల లైసెన్సులను సస్పెండ్ చేశారు, 1 ఎరువుల లైసెన్సును రద్దు చేశారు, సెక్షన్ 6-ఎ కింద 1 కేసు నమోదు చేశారు, రూ.707 లక్షల విలువైన 3372 మెట్రిక్ టన్నుల ఎరువులను నిర్బంధించారు, రూ.5 లక్షల విలువైన 2 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, రైతులకు అందకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఎరువులను పక్కదారి పట్టించినట్లు రుజువైతే సంబంధిత డీలర్ల లైసెన్సులు వెంటనే రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అంతేకాకుండా, ఈ వ్యవహారాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వ్యవసాయ శాఖ అధికారులపైనా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఒకే జిల్లాలో సంబంధిత అధికారుల పరిధిలో ఎరువుల అమ్మకాల్లో పునరావృతంగా అవకతవకలు, నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూస్తే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే సంబంధిత అధికారులను తక్షణమే సస్పెండ్ చేసే అధికారాన్ని జిల్లా జాయింట్ డైరెక్టర్లకు (జేడీలు) అప్పగించినట్లు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తుందని పేర్కొన్నారు. రైతులకు సరైన సమయంలో, సరిపడా పరిమాణంలో నాణ్యమైన ఎరువులు అందేలా జిల్లా వారీగా స్టాక్‌లపై రోజువారీ మానిటరింగ్ నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ నియంత్రణ కోసం విజిలెన్స్ విభాగం, ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల నిఘాను మరింత పెంచుతున్నట్లు తెలిపారు. రైతులను మోసం చేసే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని, రైతుల ప్రయోజనాల రక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని పేర్కొన్నారు.

# గ్రంథాలయాలు విద్యార్థులకు పాఠకులకు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి

## ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



**బీమవరం బ్యూరో చీఫ్ మే 20నంది పత్రిక** భీమవరం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కంకిపాడు మండలం తెన్నేరు గ్రామానికి చెందిన దాత దేవినేని మధుసూదన రావు అందజేసిన పుస్తకాలను జిల్లా పరిధిలోని 31 గ్రంథాలయాలకు పంపిణీ చేశారు. మొత్తం 6 విభాగాలకు చెందిన 250 పుస్తకాలను గ్రంథాలయ లైబ్రేరియన్లకు ఆయన బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దాత అందజేసిన పుస్తకాలలో పద్య పారిజాతాలు, మహాత్ముని అడుగు జాడలు, బాలల గేయాలు, బతుకు పాఠాలు, ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి, గాంధీ మహాత్ముని దృష్టిలో విద్య, పర్యావరణంపరిశుభ్రత తదితర పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. ఈ పుస్తకాలు విద్యార్థులు, యువత, సాధారణ పాఠకులకు విజ్ఞానాన్ని పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థుల ఆలోచనా విధానం, మానసిక వికాసం మెరుగుపడటంతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక విలువలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలలో పాల్గొంటున్న ప్రతి విద్యార్థి ఇటువంటి పుస్తకాలను చదివి తమ విజ్ఞానాన్ని మరింత విస్తరించుకోవాలని కోరారు. శిబిరాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసం, శారీరక చైతన్యం కలగడంతో పాటు వారి ప్రతిభను ప్రదర్శించుకునే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. జిల్లాలోని 31 గ్రంథాలయ సంస్థలలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు జూన్ 6వ తేదీ వరకు కొనసాగనున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న శిబిరాలకు తీసుకువెళ్లి సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. అలాగే దాతలు అందజేసే పుస్తకాలను గ్రంథాలయ రికార్డులలో నమోదు చేసి, వాటి నిర్వహణను సక్రమంగా చేపట్టాలని గ్రంథాలయ సిబ్బందికి సూచించారు. వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఒకే చోట లభించే కేంద్రాలుగా గ్రంథాలయాలు నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ పశ్చిమగోదావరి జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తిగ నాగరాజు, జిల్లా పరిధిలోని గ్రంథాలయాల లైబ్రేరియన్లు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# రాయలసీమ రూపురేఖలు మారుస్తున్న కూటమి ప్రభుత్వం

### రైతు సంక్షేమమే లక్ష్యం.. హార్టికల్చర్ రంగంలో ఏపీకి కొత్త దిశ
### సీఎం చంద్రబాబు విజనరీ పాలనతో వ్యవసాయ రంగంలో కొత్త చరిత్ర సృష్టిస్తున్న ఏపీ
### వ్యవసాయ, ఉద్యానవన శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి బ్యూరో చీఫ్ మే 20నంది పత్రిక** రాయలసీమ ప్రాంత అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి పాలనతో ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన రాయలసీమ ఇప్పుడు అభివృద్ధి దిశగా కొత్త అడుగులు వేస్తోందన్నారు. రాయలసీమ సమీకృత ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని రాయలసీమ ప్రాంతాన్ని దేశంలోనే ప్రముఖ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. రాయలసీమలో హార్టికల్చర్ రంగానికి అపార అవకాశాలు ఉన్నాయని గుర్తించిన సీఎం చంద్రబాబు, రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పండ్ల తోటలు, కూరగాయల సాగు, సుగంధ ద్రవ్య పంటలు, డ్రిప్ ఇరిగేషన్, కోల్డ్ స్టోరేజ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో ఈ ప్రాంత ఆర్థిక పరిస్థితుల్లో గణనీయమైన మార్పు రానుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు జరుగుతుండగా, 2030 నాటికి దాన్ని 14.41 లక్షల హెక్టార్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇందులో భాగంగానే రాయలసీమ సమీకృత ఉద్యాన అభివృద్ధి ప్రణాళికకు రూపకల్పన చేసి, అమలుకు ఉత్తర్వులు జారీ చేయడం ప్రాంత అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వెనుకబడిన రాయలసీమను అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆధునిక వ్యవసాయ సాంకేతికత, నీటి వనరుల సమర్థ వినియోగం, మార్కెటింగ్ సదుపాయాలు, ఎగుమతులకు అనుకూల విధానాలతో రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాయలసీమలో హార్టికల్చర్ రంగ అభివృద్ధితో రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. "రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అనే సంకల్పంతో సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. రాయలసీమ అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది" అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



# యువ పారిశ్రామికవేత్తలు నూతన ఆలోచనలతో ముందుకు రావాలి

## జిల్లా ఇన్చార్జి కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి



**బీమవరం బ్యూరో చీఫ్ మే 20నంది పత్రిక** జిల్లాలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు, స్టార్టప్ సంస్థల అభివృద్ధికి సాంకేతిక ఆవిష్కరణలు కీలకమని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారుఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా ఉత్పత్తుల నాణ్యత పెరగడంతో పాటు మార్కెట్ విస్తరణ, ఉపాధి అవకాశాల సృష్టి సాధ్యమవుతుందని తెలిపారు. భీమవరంలోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బుధవారం భారత ప్రభుత్వ శాస్త్ర & సాంకేతిక మంత్రిత్వ శాఖకు చెందిన డీఎస్ఐఆర్ సంస్థ ఆధ్వర్యంలోని ఎన్ఆర్డీసీ, ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆవిష్కరణల ద్వారా ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌ల బలోపేతం మేధో సంపత్తి హక్కులు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ మరియు వాణిజ్యీకరణ" అంశంపై అవగాహన కార్యక్రమానికి ఇంచార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు నూతన ఆలోచనలతో ముందుకు రావాలని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునిక టెక్నాలజీ వినియోగంతో ఉత్పత్తి ప్రక్రియలో సమయం, వనరుల వృథాను తగ్గించి తక్కువ వ్యయంతో అధిక నాణ్యత గల ఉత్పత్తులు తయారు చేయవచ్చని తెలిపారు. "కాస్ట్ ఎఫెక్టివ్ ప్రొడక్షన్" ద్వారా పరిశ్రమలు అధిక లాభాలను ఆర్జించగలవని పేర్కొన్నారు. స్టార్టప్‌ల అభివృద్ధికి ఇంక్యుబేషన్ సెంటర్లు, డిజిటల్ మార్కెటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగించుకోవడం ద్వారా పరిశ్రమలు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోగలవని అన్నారు. ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలు, యువత స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ యూనిట్లకు ప్రభుత్వం ద్వారా రుణ సదుపాయాలు, శిక్షణ కార్యక్రమాలు, సబ్సిడీలు మరియు మార్కెటింగ్ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించడం, విద్యుత్, ముడి సరుకు మరియు కార్మిక వ్యయాలను తగ్గించడం ద్వారా పరిశ్రమలు అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా చిన్న పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, యువతకు స్వయం ఉపాధి ప్రోత్సాహం, సాంకేతిక అభివృద్ధి మరియు ఎగుమతుల ప్రోత్సాహం వంటి అంశాలపై విశాఖపట్నం ఎన్ఆర్డీసీ సైంటిస్ట్ & ఇన్‌ఛార్జ్ భవ్య మంజీర, ఎన్ఆర్డీసీ ప్రాజెక్ట్ హెడ్ భువనేశ్వర్ సుధ, యువ పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు. పాల్గొన్న యువ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక "ఐపీ & టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ క్లినిక్" ద్వారా మేధో సంపత్తి హక్కులు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, పరిశ్రమల వాణిజ్యీకరణకు సంబంధించిన అంశాలపై మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు.తోలుత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యంఎస్.యం.ఇ స్టాల్ ను ఇన్చార్జి జిల్లా కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఏపీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ సత్య నారాయణ మూర్తి, విశాఖపట్నం అసిస్టెంట్ మేనేజర్ జి.సంతన్ కుమార్, పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, రైస్ మిల్లర్స్ ప్రతినిధులు, యువ ఆవిష్కర్తలు పాల్గొన్నారు

# ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు అందరూ బాధ్యతతో పని చేయాలి



## జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి

**బీమవరం బ్యూరో చీఫ్ మే 20నంది పత్రిక** జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజల్లో సానుకూల భావన కలిగించే విధంగా అన్ని శాఖలు సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.లి జిల్లా కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో బుధవారం "పాజిటివ్ పబ్లిక్ పర్‌సెప్షన్" అంశంపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల్లో ప్రభుత్వంపై ఏర్పడుతున్న అభిప్రాయాలు, సేవల అందుబాటు, శాఖల పనితీరు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం, సానుకూల దృక్పథం పెంపొందించేందుకు ప్రతి శాఖ మరింత బాధ్యతతో పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా, వేగవంతంగా, ప్రజలకు సులభంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీ పాజిటివ్ పబ్లిక్ పర్‌సెప్షన్ పోర్టల్‌లో త్రైమాసిక, నెలవారీ కృశ్చనీర్ విధానంలో సేకరించిన వివరాల ఆధారంగా శాఖల వారీగా ప్రజల అనుకూల, ప్రతికూల స్పందనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఐసిడిఎస్, రవాణా శాఖల పనితీరును జూన్ నెల నాటికి మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో పారదర్శకతతో పాటు వేగం కూడా ఉండాలని, ప్రతి అధికారి ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా స్థాయి నుండి గ్రామస్థాయి వరకు అధికారులు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరిస్తే ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు విస్తృతంగా తెలిసేలా సోషల్ మీడియా, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ లక్ష్యాలు సమర్థవంతంగా అమలవుతాయని అన్నారు. తదుపరి నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి శాఖల వారీగా పనితీరు నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణతో పాటు ఏపీఎస్‌ఆర్టీసీ, పంచాయతీరాజ్, మైన్స్, రిజిస్ట్రేషన్, వైద్య ఆరోగ్య, ఫైర్, రవాణా, సివిల్ సప్లై, విద్యాశాఖ, సర్వ శిక్ష అభియాన్, ఆర్ అండ్ బి, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఇరిగేషన్, టూరిజం, డ్వామా, ఆర్డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పురాణాలకు చరిత్రగా, ఆధ్యాత్మికతకు నిలయంగా సాంస్కృతికతకు కేంద్రంగా కీసరగుట్ట

## పర్యాటక క్షేత్రమైన కీసరగుట్టను టూరిజం శాఖ ఎంపిక హెరిటేజ్ వాక్లో సుమారు 150 మంది పాల్గొన్నారు

:-పురాణాలకు చరిత్రగా, ఆధ్యాత్మికతకు నిలయంగా సాంస్కృతికతకు కేంద్రంగా పేరుగాంచిన ప్రాచీన శివక్షేత్రం కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయం అని జిల్లా కలెక్టర్ మను చౌదరిప్రతి జిల్లాలో చారిత్రక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాలలో హెరిటేజ్ వాక్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా, మన జిల్లాలోని ప్రముఖ పర్యాటక క్షేత్రమైన కీసరగుట్టను టూరిజం శాఖ ఎంపిక చేసింది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు కీసరగుట్ట నంది విగ్రహం వద్ద ప్రారంభమై ఆలయం పైభాగం వరకు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా యువజన, క్రీడల అధికారి, జిల్లా పర్యాటకం అధికారి (ఇంచార్జ్) ఐ.విజయ కుమారి, ఎల్డీఎం శివప్రసాద్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాధిక పాల్గొన్నారు. అదేవిధంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కోలాటం కళాకారులు, సైక్లింగ్, క్రీడలకు సంబంధించిన విద్యార్థులు, స్థానిక యువత, ఆలయ పురోహితులు, ఉపాధ్యాయులు, ఎంపీఓలు, స్పోర్ట్స్ బీపీటీలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం సుమారు 150 మంది ఈ హెరిటేజ్ వాక్లో పాల్గొన్నారు. అనంతరం కీసర గుట్ట ఆలయ కమిటీ ఛైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ కలెక్టర్ కు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. తదుపరి శివాలయంలో పూజలు నిర్వహించి వేదమంత్రోచ్ఛరణతో కలెక్టర్ కు, అదనపు కలెక్టరుకు పండితులు ఆశీర్వచనం తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా జరుగుతాయని దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు ఇక్కడికి తరలివచ్చి, స్వామివారి ఆశీస్సులు తీసుకుంటారన్నారు. భక్తులకు అవసరమైన వసతులను కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగం మీద ఉందన్నారు. ప్రతి బ్రహ్మోత్సవానికి, గతంలో చేసిన దానికంటే కొత్తగా, ఏదో ఒక మెరుగుదల చూపించాలన్నారు. దేశ, విదేశాలలో కీసరగుట్టపై ఎంతో భక్తిభావం ఉన్న దాతలు చాలా మంది ఉన్నారని, ఇప్పటికే వారి విరాళాల ద్వారా ఆలయానికి సంబంధించి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు.



ప్రభుత్వం తరపున, దాతల సహకారంతో నిధులను మరింత సేకరించి ఆలయాన్ని ఇంకా అభివృద్ధి చేయవచ్చన్నారు. పర్యాటక అభివృద్ధికి అవసరమైన అంశాలను టెంపుల్ ఈవో ప్రతిపాదిస్తే, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు జిల్లా స్థాయిలో కూడా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, "కీసరగుట్ట ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతమని, నేను కొత్తగా వచ్చిన తర్వాత ఈ ప్రాంత విశిష్టతను ఎండోమెంట్ శాఖ ద్వారా తెలుసుకున్నానని, ఈ ప్రాంత అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తాము" అని తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యలపై జాప్యం తగదు

## సమస్యలను ఇకనైనా పరిష్కరించండి రాష్ట్ర ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ రాష్ట్ర కేబినెట్ లో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ఈనెల 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన రెండేళ్ళలో దాదాపు ముప్పై సార్లు మంత్రివర్గ సమావేశాలు జరిగాయని, కానీ ఇంతవరకు ఏ ఒక్క మంత్రివర్గ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలపై చర్చ జరపలేదని అన్నారు. కనీసం రేపు జరగబోయే మంత్రివర్గ సమావేశంలోనైనా జర్నలిస్టు ప్రధాన సమస్యలపై చర్చించి సమస్యలను పరిష్కరించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళయినా ఇంతవరకు కొత్త అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియ పూర్తికాలేదని, జీవో 252 జారీ చేసిన గత నాలుగు మాసాల్లో మూడు సవరణలు ఆరు అభ్యంతాలు, కోర్టు కేసులతో అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియ నత్తనడకలా సాగుతుందని, జర్నలిస్టుల ఇళ్ళస్థలాల సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. హెల్త్ కార్డులు లేక అనేకమంది జర్నలిస్టులు ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రుల్లో వైద్యం లబించక ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న, మధ్య తరహా పత్రికలకు గత రెండేళ్లుగా ప్రభుత్వం జారీచేసిన అడ్వర్టైజ్మెంట్స్ బిల్లులు ఇవ్వలేదని, బిల్లుల బకాయిలు చెల్లించకపోగా, అడ్వర్టైజ్మెంట్స్ ఇవ్వడం కూడా ఆపేసారని ఆయన ధ్వజమెత్తారు. రెండేళ్లుగా బిల్లులు రాక అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, చాలా పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ళు జర్నలిస్టుల జీవితాలతో చెలగాటం ఆడిందని, చిన్న, మధ్య తరహాపత్రికలను అణిచివేసిందని, ఈ ప్రభుత్వం కూడా అదే పద్దతిలో వ్యవహరిస్తున్నదని మామిడి సోమయ్య విమర్శించారు. జర్నలిస్టుల సంక్షేమానికి కొత్త మీడియా పాలసీ చేస్తామని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళస్థలాలిస్తామని, అక్రెడిటేషన్ కార్డులు, ఆరోగ్య భీమా



పథకం కార్డులు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్లుగా ఏదీ అమలు చేయలేదని అన్నారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపకుండా సానుకూలంగా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. రాష్ట్ర రాజధానిలో ఎటువంటి వివక్ష, వివాదం లేకుండా, సాంకేతికపరమైన సమస్యలు ఎదురుకాకుండా అర్హులైన జర్నలిస్టులందరికి త్వరితగతిన ఇళ్ళస్థలాలు కేటాయించాలని ఆయన కోరారు.

# అశ్వారావుపేట మండలంలో

# బెల్ట్ షాపుల కలకలం



నారాయణపురం బెల్ట్ షాప్..

## వినాయకపురం కేంద్రంగా తీవ్ర ఆరోపణలు మండల పరిధిలో సుమారు 75 గ్రామాలు 1,000షాప్ లు కలవు

అశ్వారావుపేట మండల పరిధిలోని ఏజెన్సీ గ్రామాల్లో మద్యం అమ్మకాలపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా వినాయకపురం గ్రామం కేంద్రంగా బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగిపోయాయని, నియంత్రణ లేకుండా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితిపై సంబంధిత అధికారులు వెంటనే దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**మండలవ్యాప్తంగా విస్తరించిన బెల్ట్ షాపుల సమస్య..** అశ్వారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులు పెరుగుతున్నప్పటికీ, వినాయకపురం నారాయణపురం ఆసుపాక తిరుమలకుంట గ్రామంలో అత్యధికంగా ఉన్నాయని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. కిరాణా దుకాణాల ముసుగులో, కొన్ని చోట్ల రహస్యంగా కూడా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఏ బ్రాండ్ మద్యం కావాలన్నా అందుబాటులో ఉంటుందని కానీ ధరలు మాత్రం షాపు నిర్వాహకుల ఇష్టానుసారం నిర్ణయిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**24 గంటల మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు..** వినాయకపురం గ్రామంలో కొన్ని బెల్ట్ షాపులు రాత్రి పగలు తేడా లేకుండా 24 గంటలూ పనిచేస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. "ఏ టైం కి వెళ్లినా బెల్ట్ షాప్ లో మద్యం దొరుకుతుంది" అనే పరిస్థితి గ్రామంలో నెలకొనడంతో యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ధరలపై నియంత్రణ లేకపోవడం భారీ వసూళ్లు..**

ప్రభుత్వ ధరల కంటే ప్రతి సీసాపై రూ.40 నుండి రూ.60 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు. కొన్ని చోట్ల ధరలు పూర్తిగా షాపుల ఇష్టానుసారం మారుతున్నాయని, ఎటువంటి బిల్లింగ్ లేదా నియంత్రణ లేకుండా విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి.

**ఆదివారాల్లో భారీ రద్దీ లక్షల్లో వ్యాపారం..** ఆదివారాలు వస్తే వినాయకపురం గ్రామంలోని బెల్ట్ షాపుల వద్ద భారీ రద్దీ కనిపిస్తుందని, అమ్మకాలు లక్షల్లో జరుగుతున్నాయని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితి గ్రామంలో మద్యం వినియోగాన్ని మరింత పెంచుతోందని, కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

**వేలం పాట పద్ధతిపై తీవ్ర ఆరోపణలు..** కొన్ని గ్రామాల్లో మద్యం షాపుల నిర్వహణ వేలం పాట పద్ధతిలో జరుగుతోందని, గ్రామ పెద్దలు కలిసి ఒకే షాపుకు హక్కులు ఇవ్వడం ద్వారా లక్షల్లో డీల్లు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోటీ లేకపోవడం వల్ల ధరలు పెరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం పై ప్రశ్నలు..** ఇన్ని ఆరోపణలు ఉన్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో ఆలస్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారా? అనే ప్రశ్నలు గ్రామ ప్రజల్లో



వినాయకపురం బెల్ట్ షాప్

బలంగా వినిపిస్తున్నాయి.

**మద్యంలో నాణ్యతపై అనుమానాలు..** కొంతమంది వినియోగదారులు మద్యంలో నాణ్యతపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది. కల్తీ మద్యం ప్రమాదం ఉందన్న భయం ప్రజల్లో పెరుగుతోంది. దీనిపై తక్షణ తనిఖీలు అవసరమని వారు కోరుతున్నారు.

**ప్రజల ప్రధాన డిమాండ్లు..** వినాయకపురం కేంద్రంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులపై తక్షణ తనిఖీలు చేపట్టాలని, అక్రమ విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని, అధిక ధరల వసూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. యువత భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని మండలవ్యాప్తంగా మద్యం నియంత్రణ కఠినంగా అమలు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలో పరిస్థితి ఇలాగే కొనసాగితే సామాజిక సమస్యలు మరింత పెరిగే ప్రమాదం ఉందని, అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# నేటి నుండి సరస్వతి అంత్య పుష్కరాలు





:-సరస్వతీ పుష్కరము అనేది సరస్వతీ నదికి సంబంధించిన పండుగ, ఇది సాధారణంగా ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి వస్తుంది. సరస్వతీ నదిని "అంతర్వాహిని" (కనిపించని నది) అని పిలుస్తారు, ఇది త్రివేణి సంగమం వద్ద ప్రవహిస్తుంది. గురు గ్రహం మిథున రాశిలోకి ప్రవేశించిన సమయం నుండి 12 రోజుల పాటు ఈ పుష్కరాన్ని జరుపుకుంటారు. 2025లో భారతదేశంలోని తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉన్న కాళేశ్వరం పట్టణంలో మే 15 నుండి మే 26 వరకు సరస్వతీ పుష్కరాలు జరిగాయి. దీనిని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో పాటు భట్టి విక్రమార్క మల్లు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీమతి కొండా సురేఖ మరియు పొన్నం ప్రభాకర్ లు పాల్గొని పుణ్య స్నానాలు చేశారు.

**సరస్వతీ పుష్కరం..** సోమనాథ్ లోని త్రివేణి ఘాట్, కపిల్, హిరణ్ అనే మూడు పవిత్ర నదులు, దివ్యమైన సరస్వతీ నది యొక్క సంగమ స్థానం. సరస్వతీ పుష్కరాలు లేదా పుష్కరాలు అనేది సరస్వతీ నదికి అంకితం చేయబడిన ఒక హిందూ పండుగ. బృహస్పతి (గురు గ్రహం) మిథున రాశిలోకి ప్రవేశించినప్పుడు, ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి దీనిని జరుపుకుంటారు. ఈ వేడుకకు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉంది మరియు గోదావరి నది ఒడ్డున స్నానపు ఆచారాలు, మతపరమైన వేడుకలు, సాంస్కృతిక ఉత్సవాలతో దీనిని జరుపుకుంటారు.

**కాళేశ్వరం సరస్వతీ అంత్య పుష్కరాలు మహోత్సవం మే 21 నుండి జూన్ 1 వరకు.. (చరిత్ర, ప్రాముఖ్యత)** పుష్కరాల పండుగలు అనేవి భారతదేశం అంతటా జరుపుకునే నదీ సంబంధిత పండుగలు. ఇవి ఒక నిర్దిష్ట నది, రాశిచక్రంతో ముడిపడి ఉంటాయి. సరస్వతీ పుష్కరాలు దివ్యమైన సరస్వతీ నదితో ముడిపడి ఉన్నాయి, వీటిని ముఖ్యంగా కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. గోదావరి, ప్రాణహిత, సరస్వతి అనే మూడు నదులు ఇక్కడ కలుస్తాయని ప్రజలు నమ్ముతారు. హిందువులకు పుష్కరాల కాలం అత్యంత పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. ఈ సమయంలో నదిలో స్నానం చేయడం వల్ల పాపాలు తొలగిపోయి, జనన మరణ చక్రం నుండి విముక్తి లభిస్తుందని ప్రజలు నమ్ముతారు. తర్పణం వంటి కర్మకాండలు చేసి మన పూర్వీకులను ప్రార్థించడానికి మరియు గౌరవించడానికి కూడా ఇది మంచి సమయం.

**త్రివేణి సంగమం..**కాళేశ్వరంలోని త్రివేణి సంగమాన్ని ఒక పవిత్రమైన ప్రదేశంగా భావిస్తారు, ఇక్కడ భక్తులు పూజలు నిర్వహించడానికి గుమిగూడతారు. మూడు నదుల సంగమం ఈ ప్రదేశాన్ని ఆధ్యాత్మికంగా మరింత శక్తివంతంగా చేస్తుంది. పుష్కరాల సమయంలో పుణ్యస్నానం చేయడం ఆధ్యాత్మిక శుద్ధిని అందించి, వ్యక్తిగత కోరికలను నెరవేరుస్తుందని ప్రజలు నమ్ముతారు. 12 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం, శ్రీ మహా సరస్వతి అమ్మవారి ఆలయం వంటి ప్రధాన దేవాలయాలలో వివిధ రకాల హోమాలు, పూజలు మరియు హారతులు నిర్వహిస్తారు. గోదావరి, సరస్వతి ఘాట్లలో స్నానం (పవిత్ర డిప్).పూర్వీకులను గౌరవించేందుకు తర్పణం. ఆరోగ్యం, జ్ఞానం, కుటుంబ సంక్షేమం మరియు ఆధ్యాత్మిక ఎదుగుదల కోసం హోమాలలో పాల్గొనడం.

**గోదావరి ఘాట్, కాళేశ్వరం..** ఉదయం 5:00 నుండి సాయంత్రం 7:00 వరకు భక్తులు ఆచారాలు నిర్వహించి పవిత్ర స్నానం చేస్తారు. మూడు నదులు కలుస్తాయని నమ్మే త్రివేణి సంగమం యొక్క ప్రధాన ప్రదేశం. నదులు, రాశిచక్ర గుర్తులు పుష్కరాల పండుగలను 12 పవిత్ర నదుల గౌరవార్థం జరుపుకుంటారు, వీటిలో ప్రతి నది ఒక రాశిచక్ర గుర్తుతో ముడిపడి ఉంటుంది.

నది రాశిచక్రం , గంగా మేషరాశి ,యమున క్యాన్సర్ , సరస్వతి మిథునం ,నర్మద వృషభ రాశి , గోదావరి లియో , కృష్ణ కన్యారాశి ,కావేరి తులారాశి ,భీమా వృశ్చికం , తుంగభద్ర మకర రాశి , సింధు కుంభరాశి , ప్రణహిత మీన రాశి , తప్తి ధనుస్సు రాశి మసరస్వతి అంత్య పుష్కరాలు 2026 మే 21న ఉదయం 5.43 గంటలకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి పుష్కర ఘాట్ వద్ద పుణ్యస్నానం ఆచరించి ఈ అంత్య పుష్కరాలను అధికారికంగా ప్రారంభిస్తారని తెలుస్తుంది. పుష్కరాల ప్రారంభోత్సవంలో కంచి స్వామీజీతో పాటు రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు పాల్గొని పవిత్ర స్నానాలు ఆచరిస్తారు.

**ముచ్చర్ల దినకర్ రచయిత 9440704535**

# జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలు సంఘటితంగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ అంబర్ పేట ఇంచార్జీ రోహిన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రోహిన్ రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో అంబర్ పేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి దేవిరెడ్డి విజితారెడ్డి, లక్ష్మణ్, రాజ్ కిరణ్ మామిడాల తదితరులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No